
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

గురువారం 24 ఏప్రిల్ 2025

ఉష్ణోగ్రత (అంచనా)

24-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	41	27
తెనాలి	39	27
నరసరావుపేట	41	24
బాపట్ల	37	28
రెంటచింతల	42	25

ప్రధాని పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

- సభా వేదిక వద్దకు చేరుకునేందుకు 8 రోడ్లు గుర్తింపు
- సభకు చేరుకునేందుకు ఈ- 11, 13, 15 రోడ్లు సిద్ధం
- 1.1 కి.మీ మేర ప్రధాని రోడ్ షో.. 5 లక్షల మందితో సభ
- పోలీస్ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి
- రూ. లక్ష కోట్ల విలువైన పనులను పీఎం మోదీ ప్రారంభిస్తారన్న మంత్రి నారాయణ

8



రోడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, ఐజీ త్రిపాఠి

బిల్లులు.. బాధలు

మూడు జిల్లాల్లో రూ.కోట్లలో పెండింగ్



- పూర్తయిన పనులకు నెలలుగా విడుదల కాని నగదు
- అప్పుల పాలై వడ్డీలు కట్టలేక పోతున్నామని నేతల ఆవేదన
- బిల్లులు వస్తే చాలు.. కొత్త పనుల జోలికి వెళ్లబోమంటున్న నేతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

- పల్నాడు జిల్లాలో 80.49 కోట్లు.., బాపట్ల జిల్లాలో రూ.58.18 కోట్లు.., గుంటూరు జిల్లాలో రూ.15.79 కోట్లు.. ఇలా బిల్లులు పేరుకుపోయాయి.
- పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు సంబంధించి రూ.154.46 కోట్ల బిల్లులు చెల్లింపులు నిలిచిపోయాయి.
- పల్నాడు జిల్లాలో 702కు 513, బాపట్ల జిల్లాలో 691కు 539, గుంటూరు జిల్లాలో 383 కు 259 మినీ గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. అయితే ముందుగా చెప్పిన విధంగా విడతల వారీగా బిల్లులు చెల్లింపులు జరగడంలేదు. మూడు జిల్లాల్లో రూ.19 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్లు అధికారుల లెక్కలు తెలియజేస్తున్నాయి.
- 2019కి ముందు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో దాదాపు రూ.106 కోట్లు బిల్లుల బకాయిలు ఉన్నట్లు పశు సంవర్థకశాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి.

మన ప్రభుత్వం వచ్చింది.. పనులు చేస్తే వెంటనే బిల్లులు వస్తాయి.. అని అప్పులు చేసి పనులు చేసిన కూటమి పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నేతలు అప్పుల పాలై అల్లాడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దఎత్తున అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. దీంతో గ్రామ, మండల స్థాయిల్లో నేతలు పెద్దఎత్తున పనులు చేపట్టారు. సీసీ రోడ్లు, మురుగు కాల్వలు వంటి పనులను పెద్దఎత్తున చేశారు. అయితే పను లు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా, వాటికి సంబంధించి బిల్లులు రావడంలేదు. బిల్లులు ఇప్పించాలని కొన్ని చోట్ల ఎమ్మెల్యే లపై నేతలు ఒత్తిడి తెస్తున్నారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో పనులు ఇస్తాం తీసుకోమంటున్నా ఎవరూ ముందుకు రావడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పార్టీ గెలుపు కోసం ఎంతో శ్రమించాం.. ప్రగతి పనులు చేస్తే కొంత ఆదాయం వస్తుందనే ఆశతో టీడీపీ నేతలు చాలావరకు అప్పులు చేసి మరీ ఉపాధి హామీ పథకం కింద పనులు చేశారు. ఈ బిల్లులు కూడా నెలల తరబడి చెల్లించ డంలేదు. పల్లె పండుగ పథకం ప్రారంభంలో వారం వారం బిల్లుల చెల్లింపులు జరిగాయి. మొదటి రెండు వారాలు చెల్లింపులు సక్రమంగా జరిగాయి. దీంతో బిల్లులు వెంటనే వస్తాయనే ఆశతో పలువురు పెద్దఎత్తున పనులు చేశారు. బిల్లుల చెల్లింపులు నిలిచి పోవడంతో వారు ఖంగుతిన్నారు.

గతంలోనూ.. ఇప్పుడూ ఒకతీరు

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా పార్టీ నేతలు పెద్దఎత్తున పనులు చేపట్టారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆయా బిల్లులను ఆపేసింది. దీంతో చాలామంది అప్పులు పాలయ్యారు. కొందరు కోర్టులను ఆశ్రయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాత బిల్లులు చెల్లిస్తారని పలువురు ఆశపడ్డారు. అయితే పాత బిల్లుల ఊసే ప్రభుత్వం ఎత్తక పోతుండటంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వలె కాకుండా పనులు చేసిన వెంటనే బిల్లులు చెల్లిస్తారనే ఆశతో పనులు పెద్దఎత్తున చేపట్టగా గతంలోని పరిస్థితి ఎదురవడంతో నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు చెల్లింపు విషయంలో పనులు చేసిన నేతలకు ప్రభుత్వం చుక్కలు చూపెడుతోంది. పనులు చేసి అప్పులు పాలయ్యామని వడ్డీలు కట్టలేక పోతున్నామంటూ నేతలు ఎమ్మెల్యేల ఎదుట ఆవేదన వక్తం చేస్తున్నారు. గతంలో, ఇప్పుడు బిల్లులు నిలిచిపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సీసీ రోడ్డు



గోకులం షెడ్

మొక్కజొన్న పేరుతో.. మెక్కేస్తున్నారు..

- అడ్వాన్స్‌డు రైల్వే ర్యాక్ బుకింగ్... అపై వసూళ్ల పర్వం
- ర్యాక్‌కు రూ. 3 నుంచి రూ. 4 లక్షల డిమాండ్!
- ఒక్క తెనాలి నుంచే లక్ష టన్నుల మొక్కజొన్నలు రవాణా
- గత వైసీపీ ప్రభుత్వ కాలంలో మొదలయిన వసూళ్లు
- డెల్టాలో అధికార, ప్రతిపక్ష పార్టీ అనుచరుల మధ్య వసూళ్ల వివాదం
- వ్యాపారులకు తలనొప్పిగా మారిన వైనం



తెనాలి రైల్వే స్టేషన్‌లో రైల్వే గూడ్స్ వ్యాగన్‌కు సరకు లోడ్ చేసేందుకు వరుసలో ఉన్న మొక్కజొన్న లారీ

మొక్కజొన్న పండించిన రైతు... వారి దగ్గర నుంచి పంట కొనుగోలు చేసిన వ్యాపారులు... ఇద్దరూ కాదని వీరి మధ్యలో వసూళ్ల రాయుళ్లు. వారికి అధికార పార్టీ నేతల అండదండలు. వెరసి రైల్వే గూడ్స్ వ్యాగన్‌ల వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంది. ఆనాడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ ప్రభుత్వ కాలంలో వసూళ్ల పర్వానికి తెరలేపితే, నేడు కూటమి నేతల మధ్య అదే అగ్గి రాజేస్తోంది. తమ వారికి వసూలు చేసుకునే అవకాశం కావాలంటే... లేదు మా వారే వసూలు చేసుకుంటారంటూ తెనాలి, బాపట్ల, విజయవాడ, ఏలూరు ప్రాంతాల వ్యాపారుల తరపున నేతలు వత్తిడి చేయటం చూస్తే ఇది మంచి ఆదాయ వనరుగా కనిపిస్తుంది. రూ. లక్షో రూ. 2 లక్షలో కాకుండా రూ. కోటిన్నర ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకుని అధికార పార్టీ నేతలు దందాకు తెరతీశారు. దీంతో ఈ వ్యవహారం కాస్తా ప్రభుత్వ పెద్దల దృష్టికి చేరిపోవటం, మీరెవరూ వద్దని, వ్యాపారుల మధ్యలో వేలుపెడితే ఊరుకునేదిలేదంటూ చివాట్లు పెట్టటం కొసమెరుపు. ఎగుమతి 'సుంకాల' వ్యవహారానికి సంబంధించి వివరాల్లోకి వెళితే...

గుంటూరు, బాపట్ల, తెనాలి, ఏప్రి ల్ 23, (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టాలో రబీ కింద మొక్కజొన్న, జొన్న పంటలు సాగవుతున్నాయి. 5.71 లక్షల ఎకరాల విస్తీర్ణంలో 4.5 లక్షల ఎకరాల వరకు మొక్కజొన్న, జొన్న పంటలు సాగవుతుంటే, దిగుబడులు ఈ సంవత్సరం ఆశాజనకంగా నే ఉన్నాయి. అయితే మొక్కజొన్నకు మద్దతు ధరతో పోల్చితే పర్వాలేదనిపించేలా మార్కెట్ రేటు ఉన్నా, తెల్ల జొన్నకు రేటు లేదు. అయితే రైతులు మాత్రం పండించిన పంట ను నిల్వ ఉంచుకునే అవకాశం లేక, ఆ ధైర్యంకూడా చేయలేక వ్యాపారులకే వచ్చిన ధరకు అమ్మేస్తున్నారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉన్న మొత్తం సాగు విస్తీర్ణంలో ప్రస్తుతానికి సగం విస్తీర్ణంలో మొక్కజొన్న, జొన్న కోత పూర్తయితే, మరికొంత విస్తీర్ణం మే, జూన్ నెలల్లో పూర్తవుతుంది. చిన్న వ్యాపారులు ఇప్పటికే మొక్కజొన్న, జొన్న రైతుల నుంచి కొంటున్నారు. అయితే వీటిని ఎగుమతి దారులకు అమ్మకాలు సాగించాల్సి ఉంది. అది జరగాలంటే సరకు ఇతర రాష్ట్రాలకు పంపేందుకు రైల్వే ర్యాక్‌లు అవసరం అవుతుంది. ఇక్కడే అసలు రాజకీయం మొదలవుతోంది.

ర్యాక్‌ల వసూళ్ల రగడ వైసీపీ ప్రభుత్వ కాలం నుంచే...

వ్యాపారులు తాము కొన్న సరకును ఇతర రాష్ట్రాలు, దేశాలకు పంపాలంటే మనకు అనుకూలంగా ఉన్నది రైల్వే రవాణా వ్యవస్థే కీలకం. దీనికోసం రైల్వే ర్యాక్‌లను బుక్ చేసుకోవలసి ఉంటుంది. ఒక్కో ర్యాక్‌లో 2,500 టన్నుల సరకు రవాణా చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇంత మొత్తంలో ఒకే వ్యాపారి కొనలేరు కనుక కొంత మంది వ్యాపారులు కలసి ఒక ర్యాక్ చొప్పున బుక్ చేసుకుని సరకును తమిళనాడు, కర్నాటక వంటి రాష్ట్రాలకు పంపుతారు. అక్కడి ఎగుమతి దారులు ఆ సరకును దింపుకుని ఇతర దేశాలకు ఎగుమతి చేసుకోవటం పరిపాటి. అయితే ఇక్కడే ర్యాక్‌ల లొల్లి మొదలయింది. గూడ్స్ వ్యాగన్‌ల అవసరాన్ని గుర్తించిన కొందరు దళారులు మధ్యలో చేరిపోయారు. గత వైసీపీ ప్రభుత్వ కాలం నుంచి ఈ కొత్త దందాకు తెరలేపారు. వ్యాపారుల స్థానంలో కొందరు దళారులు ముందుగానే ర్యాక్‌లు బుక్‌చేసుకుని పెట్టేస్తారు. వ్యాపారులకు అవసరమైన సమయంలో వాటిని తెప్పించి సరకు లోడ్ చేసుకుని పంపాలంటే (మిగతా 8వ పేజీలో)



శ్రీహసిని (598 మార్కులు)



పఠాన్‌మహ్మద్‌అబ్దుల్ రెహమాన్ (592 మార్కులు)



మద్దినేని మనోజ్ఞ



షేక్ హస్నేజాహ (591 మార్కులు)

పదిలో 4వ స్థానం

- జిల్లాలో 88.53 శాతం ఉత్తీర్ణత
- పదో తరగతి ఫలితాల్లో బాలికలదే పైచేయి
- సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ బుధవారం విడుదల చేసి పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 88.53 శాతం ఉత్తీర్ణతతో జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. గత నెలలో జరిగిన పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 27,255 మంది పరీక్షకు హాజరు కాగా వారిలో 24,129(88.53 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత విషయంలో బాలురు కంటే బాలికలే అగ్రభాగంలో నిలిచారు. పరీక్షలకు 12,811 బాలికలు హాజరుకాగా వారిలో 11562(90.25 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 14,444 మంది హాజరు కాగా 12,567(87 శాతం) ఉత్తీర్ణత సాధించారు. గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ మున్సిపల్, కార్పొరేషన్ స్కూల్స్ యాజమాన్యాల ఆధ్వర్యంలో పరీక్షలు రాసిన విద్యార్థులు ఉత్తీర్ణత విషయంలో సత్తాచాటారు. గుంటూరుకు చెందిన విద్యార్థిని పీవీఎస్ఎస్ఎస్ శ్రీహసిని అత్యధికంగా 598 మార్కులు సాధించింది. తాడికొండలోని ఏపీఆర్ఎస్ విద్యార్థిని పఠాన్‌మహ్మద్‌అబ్దుల్ రెహమాన్ 592 మార్కులు, తెనాలి సమీపంలోని సంగం జాగర్లమూడి జడ్పీ స్కూల్ విద్యార్థిని మద్దినేని మనోజ్ఞ, తెనాలి కొత్తపేటలోని ఎస్‌డీఐ మున్సిపల్ స్కూల్ విద్యార్థిని షేక్ హస్నేజాహ, పెదకాకాని జడ్పీ స్కూల్ విద్యార్థిని ఎస్కే రిజ్వానా 591 మార్కులు సాధించారు. గుంటూరు మండలం ఏటుకూరు జడ్పీ స్కూల్ విద్యార్థిని బుర్రి రూపశ్రీ 585, తోకాచిచ్చు ప్రియవందన 581, గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని జలగం రామారావు మున్సిపల్ స్కూల్ విద్యార్థి చాంద్‌బాష 582, గుజ్జనగుండ్ల మున్సిపల్ స్కూల్ విద్యార్థిని డీ శ్రీలక్ష్మి 581 మార్కులు సాధించారు.

సర్టిఫికెట్ల కోసం సతమతం

- డీఎస్సీ దరఖాస్తుదారులకు చిక్కులు
- కుల, ఆధార్, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం పాట్లు
- జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో స్పందించని సిబ్బంది
- సమీపిస్తున్న గడువు.. నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో ఆందోళన

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల తర్వాత డీఎస్సీ (జిల్లా నియామక కమిటీ)-2025 నోటిఫి కేషన్ విడుదలైంది. అయితే ఎంతోకాలంగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ ఉపాధ్యాయులు సంతోషించే లోపే సర్టిఫికెట్ల అప్‌లోడింగ్ కోసం పెట్టిన నిబంధనలు చూసి మనోవేదనకు గురౌతున్నారు. గతంలో పరీక్ష రాసేందుకు విద్యార్హతల సర్టిఫికెట్లు మాత్రమే అప్‌లోడింగ్ చేస్తే సరిపోయేది. ఇప్పుడు ఆధార్, కుల, ఆదాయం, నివాస తదితర సర్టిఫికెట్లు అప్‌లోడింగ్ చేయాలని నిబంధన పెట్టారు. అయితే ఈ నిబంధన పురుషులకు ఎలాంటి ఇబ్బంది లేదు. వివాహితులకు సమస్యలు సృష్టిస్తున్నది. ఇందుకు కార ణం వారి విద్యార్హతల సర్టిఫికెట్లు తండ్రి ఇంటి పేరుపై ఉండగా ఇతర ధ్రువీకరణ పత్రాలు భర్త ఇంటి పేరుతో ఉంటాయి. ఇప్పుడు వాటిని మార్చుకోవాలంటే పాత సర్టిఫికెట్ల రిఫరెన్స్ నంబర్లను రెవెన్యూ అధికారులు అడుగు తున్నారు. అయితే ఆ రిఫరెన్స్ నంబర్లు లేకపోవడంతో దరఖాస్తు దారులు జాయింట్ కలెక్టర్ కార్యాలయానికి వస్తుండగా సిబ్బంది సరిగా స్పందించడం లేదు. పైగా సీసీఎల్ఏ(భూపరిపాలన ముఖ్య కమి షనర్ కార్యాలయాని)కి వెళ్లమంటూ ఉచిత సలహాలు ఇస్తుండటంతో దరఖాస్తు దారులు ఆవేదన చెందు తున్నారు.

15వ తేదీ వరకే గడువు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,143 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గత వారంలో నోటిఫికేషన్ విడుదలైంది. మే 15వ తేదీ లోపు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉన్నది. ఇందుకోసం తొలుత దరఖాస్తుదారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత అం దులో ఖాళీలు నింపి, అవసరమైన పత్రాలు అప్‌లోడ్ చేసి నగదు చెల్లిస్తేనే విజయవంతంగా దరఖాస్తు అప్ లోడింగ్ జరుగుతుంది. ఇక్కడే అసలు సమస్య వచ్చి పడింది. కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం మేరకు ఎప్పటి కప్పుడు తహసీల్దారు కార్యాల యాల నుంచి తీసుకొంటుంటారు. సర్టిఫికెట్ తీసుకొన్న ప్రతీసారి రిఫరెన్స్ నంబరు మారిపోతుంటుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు తాజాగా ఆయా సర్టిఫికెట్లు కావా లంటే పాత రిఫరెన్స్ నంబర్లను అడుగుతున్నారు. అవి దరఖాస్తుదారుల వద్ద అందుబాటులో లేవు. గతంలో మీ-సేవ సర్వీసులు ఉన్నప్పుడు వారి వద్ద డేటా ఉండేది. వైసీపీ ప్రభుత్వ హయాంలో సర్వీసులు మీ-సేవ నుంచి తీసేసి గ్రామ/వార్డు సచివాలయాలకు మార్చారో అప్పటి నుంచి పాత రిఫరెన్స్ నంబర్లు కని పించడం లేదు. ఒకవైపు దరఖాస్తు చేసుకోవడానికి గడవు సమీపిస్తుండగా అధికారుల నుంచి సహకారం అందకపోవడంతో ఔత్సాహికులు ఆందోళన చెందుతు న్నారు. తమకు విద్యార్హతలలో ఏ ఇంటి పేరుతో అయి తే సర్టిఫికెట్లు ఉన్నాయో వాటి పేరుతోనే కులధ్రువీకరణ, నివాస, ఆదాయం, ఈడబ్ల్యూఎస్ తదితర సర్టిఫికెట్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు. ఆధార్‌లో పేరులో సవరణలు చేసుకోవడానికి పరిమితి ఉన్నది. జీవితకాలంలో కేవలం రెండేసార్లు పేర్లు అప్‌డేట్ చేసుకోవచ్చు. అంతకుమించి చేయడానికి వీల్లేదు. అయితే ఇప్పటికే చాలామంది తెలియక ఆధార్‌లో పేర్లను అప్‌డేట్ చేసుకున్నారు. దీంతో వారికి తాజాగా మరోసారి మార్పు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. ఒక సర్టిఫికెట్ కి, మరో దానికి ఏమైనా చిన్న మార్పులు ఉంటే తహసీల్దార్లు రెండూ ఒకటే అని ప్రత్యేకంగా గతంలో ధృవీకరించేవారు. ఇప్పుడు ఆలా చేయడంలేదు. ఇలాంటి సమస్యలతో కలెక్టరేట్‌కు వస్తున్న వారికి సహకరించాల్సిన సిబ్బంది అందుకు విరుద్ధంగా వ్యవ హరిస్తుండటంపై అభ్యర్థులు ఆందో ళన చెందుతున్నారు. దీనిపై గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి తగిన ఆదేశాలను అధికారులకు ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు.

గుంటూరు మేయర్ ఏకగ్రీవమేనా?

- సమావేశానికి హాజరుకు వైసీపీ అయిష్టత
- ఓటమి భయంతోనే కాడి కింద పడేసిన కావటి
- మిగతా వారిని నడిపించే నాథుడే లేని దుస్థితి

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర మేయర్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎన్నికలో పాల్గొనేందుకు వైసీపీ కార్పొరేటర్లు, ఎమ్మెల్సీలు అయిష్టత చూపుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే వైసీపీలో ఉన్న కార్పొరేటర్లు కొందరు టీడీపీ, జనసేనలో చేరారు. ఇటీవల స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఆరుగురు సభ్యులను కూటమి గెలుపొందింది. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైసీపీకి చెందిన ముగ్గురు కార్పొరేటర్లు ప్లేటు పిరాయించి కూటమి సభ్యుల గెలుపునకు సహకరించారు. దీంతో కౌన్సిల్‌లో వైసీపీ కార్పొరేటర్ల పరిస్థితి మరింతగా పలచబడింది. గత నెల 15న అనూహ్యంగా మేయర్ పదవికి మనోహర్‌నాయుడు రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో మేయర్ ఎన్నికలో పాల్గొని పరువు పోగొట్టుకునే కన్నా దూరంగా ఉంటే మంచిదని వైసీపీ అగ్ర నాయకులు భావిస్తున్నట్లు తెలిసింది. మేయర్ ఎన్నికలో పాల్గొని ఓడిపోయే కంటే బెట్టుగా బాయ్‌కాట్ చేస్తున్నట్లుగా ప్రకటిస్తేనే పార్టీ పరువు దక్కే అవకాశం ఉన్నట్లుగా మరో నాయకుడు భావిస్తున్నారు. దీనిపై వైసీపీలో నాయకులకు, ఆ పార్టీ కార్పొరేటర్లకు మధ్య చర్చ జరుగుతున్నట్లు తెలిసింది. అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనే అవకాశం ఉన్నా ఆయన తన పదవికి రాజీనామా చేసుండేవారు కాదు. ఏదో విధంగా తన పదవిని నిలుపుకునేందుకు ప్రయత్నించేవారు. అయితే విశాఖ పట్నంలో జరిగిన రీతిలోనే తనకు పరాభవం జరుగుతుందని ముందుగానే గ్రహించిన మనోహర్ రాజీనామా చేసి తప్పుకున్నారు.

నాథుడే లేని దుస్థితి..

వైసీపీ తరపున అత్యధిక మెజార్టీతో 2021లో మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన మనోహర్‌నాయుడు అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేయడంతో ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లు పూర్తిగా డైలమాలో పడ్డారు. నగర ముఖ్య నాయకుడే పదవికి రాజీనామా చేయడంతో పార్టీలోని కార్పొరేటర్లను ముందుండి నడిపించే వారే లేకుండా పోయారు. దీంతో వైసీపీకి చెందిన అనేక మంది కార్పొరేటర్లు కూటమి ప్రభుత్వంలో చేరిపోయారు. 27 మంది కార్పొరేటర్లు, ఇద్దరు ఎమ్మెల్సీలతో కలుపుకుని వైసీపీ సంఖ్యాబలం 29కి చేరుకుంది. ఈ పరిస్థితుల్లో మేయర్ ఎన్నికలో పాల్గొని ఓడిపోయే కన్నా బెట్టుగా తప్పుకుంటేనే మంచిదని ఆపార్టీ నాయకులు భావిస్తున్నట్లు గెలిసింది.

కౌన్సిల్ వాయిదా..

నగరపాలక సంస్థలో 28న జరగాల్సిన కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అనివార్య కారణాల వల్ల కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేస్తూ ఎప్పుడు నిర్వహించేది త్వరలో తేదీ ప్రకటిస్తామని అధికారులు పేర్కొన్నారు.

మైనింగ్‌లో ఏమి జరుగుతోంది?

- దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లిన డీఎంవో
- పల్నాడు అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా గనులు భూగర్భ శాఖలో మైనింగ్ డాన్ల పెత్తనం పెరిగింది. తాము చెప్పిన పని ఏదైనా చేయాల్సిందేనని అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. ఏమైనా అడ్డు చెబితే పైస్థాయిలో ఒత్తిళ్లు తీసుకొచ్చి దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లే పరిస్థితులు కల్పిస్తున్నారు. తాజాగా గుంటూరు జిల్లా మైనింగ్ అధికారి ధూళిపాల శ్రీసాయి సెలవు పెట్టి వెళ్లిపోవడానికి కారణం మైనింగ్ డాన్‌లేనన్న ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ప్రభుత్వం పల్నాడు జిల్లా డీఎంవో నాగిణిని గుంటూరుకు ఎఫ్ఏసీగా నియమించింది. కాగా రెండు జిల్లాల్లో ఖనిజ సంపద అపారంగా ఉన్న నేపథ్యంలో ఒక అధికారి బాధ్యతలు నిర్వహించడం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా కొత్త అధికారిని గుంటూరు మైనింగ్ డిపార్టుమెంట్‌కు పోస్టింగ్ చేయాలని వివిధ వర్గాలు కోరుతున్నాయి. మైనింగ్ డాన్‌గా వెలుగొందుతున్న కృష్ణా జిల్లాకు చెందిన వ్యక్తి ఇటీవలే జిల్లాలోని క్రషర్స్‌పై కన్నేశారు. అమరావతి రాజధాని నగర నిర్మాణ పనులు వచ్చే నెల 2న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన అనంతరం జోరందుకోనున్నాయి. దీంతో మెటల్, ఇసుక, గ్రావెల్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడుతుంది. దీనిని సొమ్ము చేసుకునేందుకు మైనింగ్ డాన్ పథకరచన చేశాడని, మంత్రి పేషీ, స్టేట్ ఆఫీసులో తనకున్నన్న పరపతిని వినియోగించి ఇక్కడి అధికారులపై ఒత్తిడి చేయించి జిల్లాలోని ఆరు క్రషర్స్‌ని తన ఆధీనంలోకి తీసుకునే ప్రయత్నం చేశారు. క్రషర్స్ యజమానులు తమకు తెలిసిన టీడీపీ నేతల ద్వారా సీఎంని కలిసి డాన్ ఒత్తిళ్ల గురించి వివరించారు. కాగా డాన్ తరపున వకల్తా పుచ్చుకున్న మైనింగ్ అధికారి చిక్కుల్లో పడ్డారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో ఆయన సెలవు పెట్టి వెళ్లిపోవాల్సిన పరిస్థితి తలెత్తింది. జిల్లా మైనింగ్ అధికారి కాంట్రాక్టర్లు, ప్రభుత్వ శాఖలు, క్రషర్స్, మైనింగ్ చేసే గుత్తేదారులను సమన్వయం చేసుకుని సకాలంలో ఖనిజం సరఫరా అయ్యేలా చూడాలి. లేకుంటే ఆయా ఖనిజాల కొరత కారణంగా అభివృద్ధి పనులు నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తగినచర్యలు తీసుకోవాలని ఆయావర్గాలు కోరుతు న్నాయి.

ఏఎన్‌యూ ఇంజనీరింగ్ సెమిస్టర్ ఫలితాల విడుదల

పెదకాకాని, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన మొదటి సెమిస్టర్ 4/4 ఫలితాలను వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90.12 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 638 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 578 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. మే నెల ఒకటవ తేదీ వరకు రీవాల్యుయేషన్‌కి అవకాశం ఇస్తున్నట్లు ఆలపాటి శివప్రసాద రావు తెలియజేశారు. పరీక్ష ఫలితాలను వర్సిటీ అధికారిక వెబ్సైట్ లో పొందుపరిచామని తెలిపారు.

పది ఫెయిల్.. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి

ఫిరంగిపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ బుధవారం విడుదల చేసిన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఫిరంగిపురం గ్రామానికి చెందిన పసల వినయ్ కుమార్(16) అనే విద్యార్థి ఫెయిల్ అయ్యాడు. లెక్కల సబ్జెక్టులో తప్పినట్లు తెలుసుకున్న వినయ్‌కుమార్ ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. చుట్టు పక్కల వారు గమనించి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకు వెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి జీవన్‌దాసు కార్పెంటర్ వృత్తి చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. విద్యార్థికి తల్లి నక్షత్రం, చెల్లి తేజ ఉన్నారు.

1,29,798 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,22,419 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,29,798 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 58,020 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	13500
334	9500	13000	షార్క్-1	10000	12000
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	10000	12400	సింజెంటా		
341	10000	13000	బ్యాడిగి 5531	–	–
4884	10000	11300	దేవనూరుడీలక్స్	10000	12400
సూపర్10	10000	12600	ఆర్మూరు	9800	11000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తాలుకాయలు	4500	6500

పది ఫలితాల్లో గురుకుల విద్యార్థుల సత్తా

● నూరుశాతం ఫలితాలతో యద్దనపూడి పాఠశాల ప్రథమస్థానం

గుంటూరు(విద్య),ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలోని గురుకుల పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారని కోఆర్డినేటర్ పద్మజ వెల్లడించారు. బాపట్ల జిల్లాలోని యద్దనపూడి గురుకుల పాఠశాలలో నూరుశాతం ఫలితాలు నమోదు అయ్యాయని, ఇక్కడ నుంచి మొత్తం 76 మంది పరీక్షకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారన్నారు. అదేవిధంగా కాకుమాను గురుకుల పాఠశాల 98.65శాతం, తాడికొండ 87.1, అడవితక్కెళ్ళపాడు 78.57, కారంపూడి 88.89, రామకృష్ణాపురం 81.25, అచ్చంపేట 88.89, వీపీసౌత్ 91.84, ఉప్పలపాడు 81.01, అమరావతి 89.56, వినుకొండ 93.51, గురజాల 75.81, యడ్లపాడు 77.78, సత్తెనపల్లి 88.89, బాపట్ల 96, నిజాంపట్నం 87.04, రేపల్లె 88.64, చుండూరు 76.12, నరసాయపాలెం 82.14, నాగులపాలెం 92.13, నార్త్ అద్దంకి 90.66శాతం ఫలితాలు సాధించారని వెల్లడించారు.

సత్తాచాటిన బీసీ హాస్టల్స్ విద్యార్థులు

బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మొత్తం 12 హాస్టల్స్ నుంచి 123 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకాగా వారిలో 113 మంది ఉత్తీర్ణులయ్యారని బీసీ సంక్షేమశాఖాధికారి కే మయూరి వెల్లడించారు. ఇందులో 76 మంది ప్రథమశ్రేణిలో, 25 మంది ద్వితీయ శ్రేణిలో, 12 మంది తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులు అయినట్లు వివరించారు. జిల్లా ఉత్తీర్ణత 88.53శాతం కాగా బీసీ హాస్టల్స్‌లో 91.87శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. తమ హాస్టల్స్‌లో 8 మంది హాస్టల్ విద్యార్థులు 500పైగా మారులు సాధించగా వీరిలో చల్లా శివశేఖర్ 544(పెనుమాక), జీ జగదీష్ 535(ఫిరంగిపురం), పీ శాంతిశ్రీ 532(తాడికొండ), దావూరి సాయిరామ్ 526(తెనాలి), వీవి ఇందు 516(తాడికొండ) మార్కులు సాధించారని వెల్లడించారు.

జిల్లాలోని 14 సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్స్ నుంచి 97 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వారిలో 85 మంది (88శాతం) ఉత్తీర్ణత సాధించారని సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జి డీడీ రాజాడెబోరా వెల్లడించారు. ఉత్తీర్ణులైనవారిలో ప్రథమశ్రేణిలో 58మంది, ద్వితీయ శ్రేణిలో 19మంది, తృతీయ శ్రేణిలో 8 మంది ఉన్నారని తెలిపారు. ఇందులో ఏ రిత్విక(మంగళగిరి) 539 మార్కులు, ముట్లూరి యశ్వంత్(పెదనందిపాడు) 528 మార్కులు, శీలం రేష్మా (రాజాగారి తోట,గుంటూరు) 526 మార్కులు, సొపాటి సతీష్ (మునిపల్లె) 525 మార్కులు, బీ ప్రసాద్(బృందావన్‌గార్డెన్,గుంటూరు)515 మార్కులు, కే కావ్య(దుగ్గిరాల) 506 మార్కులు, సుమశ్రీ(పొన్నూరు) 502 మార్కులు సాధించినట్లు డీడీ రాజాడెబోరా తెలిపారు.

● జిల్లాలోని గిరిజన సంక్షేమశాఖ హాస్టల్స్ నుంచి 27 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకాగా వారిలో 21 మంది (77.77 శాతం) ఉత్తీర్ణులయ్యారని గిరిజన సంక్షేమశాఖాధికారి మురళి వెల్లడించారు. గురుకుల పాఠశాలల నుంచి 60 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 36 మంది(65.56శాతం) ఉత్తీర్ణత సాధించారు.

రైతులకు కొత్త వంగడాలు అందించాలి

● ఎన్‌జీ రంగా వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ శారదా జయలక్ష్మీ దేవి

లాంఫాం(తాడికొండ)ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రైతుల సూచనలు, సలహాలను దృష్టిలో ఉంచుకుని కొత్త వంగడాలపై సరైన ఫీడ్ బ్యాక్ రైతులకు అందించాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. లాంఫాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటు కృష్ణా మండలం వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశాన్ని నిర్వహించారు. బుధవారం జరిగిన సమావేశానికి పరిశోధనా సంచాలకులు డాక్టర్ పీవీ సత్యన్నారాయణ అధ్యక్షత వహించారు. ముందుగా లాంఫాం ఏడీఆర్ దుర్గా ప్రసాద్ గత సంవత్సరం జరిగిన పరిశోధనా ప్రగతిని పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా వీసీ శారదా జయలక్ష్మీదేవి మాట్లాడుతూ సహజ వనరుల పొదుపు, నేల ఆరోగ్యం వంటి పలు అంశాలను పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. వైవిధ్యమైన పంటల సరళి, అత్యధిక పరిశోధన, విస్తరణ కేంద్రాలు గల కృష్ణా మండలంలో నిష్ణాతులైన రైతుల ద్వారా సాగు సమస్యలు, సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ జీ శివనారాయణ మాట్లాడుతూ జిల్లా వనరులు, అవసరాలు, పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని పరిశోధనలు జరగాలన్నారు. వివిధ జిల్లాల వ్యవసాయ అధికారులు అక్కడి పంటల స్థితిగతులు, పంటల సమస్యలు, మినీకిట్ల పనితీరు తెలియజేస్తూ రానున్న సంవత్సరలో చేపట్టవలసిన పరిశోధనలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం రైతులకు ఉపయోగపడే కేవీకే ఘంటశాల, కేవీకే గరికపాడు వారు పలు ప్రచురణలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆరు జిల్లాల జిల్లా వ్యవసాయ అధికారులు, 12 పరిశోధన స్థానాలు, ఆరు విస్తరణ యూనిట్ల శాస్త్రవేత్తలు, వివిధ పంటల ప్రధాన శాస్త్రవేత్తలు, డీఆర్ఎస్ అధికారులు, ఆరు జిల్లాల నుంచి అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న కంటైయినర్

క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలింపు

చిలకలూరిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట కొత్త బైపాస్ రోడ్డుపై బుధవారం పురుషోత్తమ పట్నం ఫ్లైఓవర్‌కు సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఖాళీ కంటైయినర్ లారీ క్యాబిన్‌లో తమిళనాడుకు చెందిన డ్రైవర్ ఎన్ మురుగన్ (54) ఇరుక్కుపోయి స్పృహ కోల్పోయాడు. నిద్రమత్తులో ఇతడు రోడ్డు పక్కన డివైడర్ పై ఉన్న మొక్కలకు నీరు పెడుతున్న మరొక ట్యాంకర్ లారీని ఢీకొట్టాడు. దీంతో ఇతడి లారీ క్యాబిన్ పూర్తిగా ధ్వంసమై లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న చిలకలూరిపేట అర్బన్ పోలీసులు, అగ్నిమాపక దళ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అర్బన్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో హైవే పై ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. ఫైర్ ఆఫీసర్ ఎన్ కిరణ్ కుమార్ రెడ్డి, ఎల్ ఎఫ్ వెంకయ్య, అగ్ని మాపక సిబ్బంది లారీ క్యాబిన్ కట్ చేసి డ్రైవర్ మురుగన్‌ను రక్షించారు. తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనంలో తక్షణ వైద్యచికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



క్యాబిన్లో ఇరుక్కుపోయిన డ్రైవర్ మురుగన్

డ్రైవర్‌ను రక్షించేందుకు క్యాబిన్ కట్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

◆ వైద్యులు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం

◆ డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి తగిన చర్యలు చేపట్టాలని సూచన

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం మండల కేంద్రం భట్టిప్రోలులో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో రికార్డులను ఎమ్మెల్యే పరిశీలించారు. పట్టికలో హాజరు వేసిన వైద్యులు అక్కడ అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు సరైన సేవలు అందడం లేదని తన దృష్టికి వచ్చినట్లుగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆకస్మిక తనిఖీల్లో కూడా అదే తేట తెల్లం అయ్యిందని మండిపడ్డారు. ఈ విషయంపై డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి ఆరోగ్య కేంద్రం స్థితిగతులు సక్రమంగా లేవని, రోగులకు అందుబాటులో వైద్యులు ఉండటం లేదన్నారు. వెంటనే ఆరోగ్య కేంద్రంపై దృష్టి సారించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న అన్నక్యాంటీన్ స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. తొలుత టీడీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి కార్యాలయంలో కార్యకర్తలతో ముచ్చటించారు. వైద్య కేంద్రం తనిఖీలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో వెంకటరమణ, ఈవోపీఆర్‌డి ఊహారాణి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

పశువైద్య సేవలను మరింత చేరువ చేస్తాం

డాక్టర్ సాంబశివరావు

పశుసంవర్ధక శాఖ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక

గుంటూరు సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కే సాంబశివరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఎన్నిక బుధవారం గుంటూరులో నిర్వహించారు. రాష్ట్ర పశువైద్యాధికారుల సంఘం అధ్యక్షులు డాక్టర్ కల్లూరి సత్యనారాయణ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎం నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా డాక్టర్ కేవీ జనార్దనరావు, ట్రెజరర్‌గా డాక్టర్ ఏ మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ ఎస్ కళావతి ఎన్నికయ్యారు .కొత్తగా ఎన్నికైన వారికి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఓ నరసింహారావు అభినందనలు తెలిపారు .జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ కే సాంబశివరావు మాట్లాడుతూ పశువైద్య సేవలను మరింత చేరువ చేస్తామని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ జిల్లాని ప్రగతి పథంలో ఉంచుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సర్జన్ లక్కింశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పశుసంవర్ధక శాఖ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ ను అభినందిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నరసింహారావు తదితరులు

ఉగ్రదాడిపై వర్సిటీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ

పెదకాకాని, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల మారణహోమంలో 27 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఏబీవీపీ నాయకులు తెలిపారు. బుధవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏఎన్‌యూ శాఖ ఆధ్వర్యంలో బాధితులకు కొవ్వొత్తుల ర్యాలీతో నివాళులర్పించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, పరిశోధకులు పాల్గొని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యతను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రామకాంత్, మోహన్ రావు, గంగాధర్, శివ గణేష్ పాల్గొన్నారు.

విద్యాజ్యోతితో జడ్పీల్లో ఉత్తమ ఫలితాలు

జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా

గుంటూరు సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలోని పాఠశాలల్లో ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. జడ్పీ ద్వారా సరఫరా చేసిన విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ వల్లే ఇటువంటి ఫలితాలు సాధ్యం అయ్యాయన్నారు. బుధవారం పదో తరగతి పరీక్షల ఫలితాలు విడుదలైన తర్వాత జడ్పీ ఛైర్‌పర్సన్ పల్నాడు జిల్లా కారంపూడి మండలం ఒప్పిచర్ల పాఠశాలకు చెందిన అంగటి పావని చంద్రికకు ఫోన్‌చేసి అభినందించారు. మొత్తం 600 మార్కులకు గాను 598 మార్కులు సాధించటం వల్ల పావని ప్రభుత్వ పాఠశాలల గౌరవం నిలబెట్టారని, ప్రధానోపాధ్యాయురాలు లలిత కుమారి కూడా చాలా కష్టపడ్డారని అన్నారు. గుంటూరు జిల్లా 88.53%, పల్నాడు జిల్లా 84.15%,బాపట్ల జిల్లాలో 83.96% మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని జడ్పీ ఛైర్ పర్సన్ పేర్కొన్నారు.

నిరంతర సాధనతోనే మెరుగైన ఫలితాలు

● భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణ

గుంటూరు (విద్య) ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తామని, ఇందుకు ఉపాధ్యాయని నిరంతర కృషి తోడు కావడంతో మెరుగైన ఫలితాలు సాధ్యమౌతున్నాయని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. బుధవారం చంద్రమౌళి నగర్‌లోని మెయిన్ క్యాంపస్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన పదో తరగతి ఫలితాలలో రాష్ట్రంలో తమ విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచాయని తెలిపారు. భాష్యం విద్యార్థి వై నేహాంజని 600కి 600 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో నిలిచినట్లు తెలిపారు. అదేవిధంగా కె.ప్రేమ సత్య లిఖిత 599, కె.హర్షిత్ 599, ఎ. లిఖిత 599, పి.వి.ఎస్.ఎస్.శ్రీహాసిని 598, ఎస్. షాలిని సంహిత 598 మార్కులు, ఎం.ప్రియజోషిని 598 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. గణితంలో 100కు 100 సాధించిన విద్యార్థులు 1088 మంది, సైన్స్ లో 100కు 100 సాధించిన వారు 724 మంది ఉన్నట్లు తెలిపారు. భాష్యం విద్యాసంస్థలు సాధించిన విజయానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ప్రోత్సాహం, సంస్థలపై ఉన్న నమ్మకమే కారణమని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

పది ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య),ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఛైర్మన్ ఫ్రాన్సిస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థులు 597 మార్కులు సాధించినట్లు వివరించారు. 590 పైన 9 మంది, 580 పైన 65 మంది, 570 పైన 130 మంది, 560 పైన 213 మంది, 550 పైన 281 మంది, 540 మార్కులపైన 351 మంది సాధించారన్నారు. తమ పాఠశాలలో 77 మందికి గణితంలో 100మార్కులు, తెలుగులో 40 మందికి 100 మార్కులు వచ్చినట్లు వివరించారు. ఇంకా సోషల్లో 52 మందికి 100 మార్కులు,సైన్స్‌లో 42 మందికి 100 మార్కులు, హిందీలో 100 మందికి 95 పైన మార్కులు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ డాక్టర్ ఫ్రాన్సిస్ రెడ్డి, వైస్ ఛైర్మన్ ఆరోన్‌రెడ్డి, డైరెక్టర్స్ విజయభాస్కర్ రెడి, జోసఫ్ రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనా బేగం, వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి తదితరులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

గుంటూరు మీదగా చర్లపల్లి, విశాఖపట్టణంలకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, విశాఖపట్టణంలకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 08579 విశాఖపట్టణం - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 25 నుంచి మే 30వ తేదీ వరకు ప్రతీ శుక్రవారం సాయంత్రం 5.30కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2 గంటలకు గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 7.20 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు. 08580 చర్లపల్లి - విశాఖపట్టణం ప్రత్యేక రైలు ఈ నెల 26 నుంచి మే 31 వరకు ప్రతీ శనివారం రాత్రి 7 గంటలకు బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి మీదగా రాత్రి 10.40కి గుంటూరు, ఉదయం 8 గంటలకు విశాఖపట్టణం చేరుకొంటుందని సీపీఆర్‌వో తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 514.60 అడుగులు ఉంది. ఇది 139.61 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



కార్పొరేటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

ప్రజలు, ప్రభుత్వానికి మధ్య నాయకులే వారధి

● కార్పొరేటర్ల సమావేశంలో ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధి నాయకులేనని, వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ కార్పొరేటర్లకు సూచించారు. గుంటూరు తూర్పు కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్లతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల కాలంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సేవలను వారికి దగ్గరకు చేరుస్తున్నామని ఆయన చెప్పారు. డిప్యూటీ మేయర్ సజీల, నియోజకవర్గం పరిధిలోని కార్పొరేటర్లు పాల్గొన్నారు.

● నియోజకర్గానికి చెందిన చల్లా బాలశౌరికి 2023 ఆగస్టు నెలలో యాక్సిడెంట్ కావడంతో ఎడమ చేయి కోల్పోయాడు. ఆ సమయంలో నసీర్ బాలశౌరి కుటుంబానికి భరోసా ఇచ్చారు. తాజాగా బాలశౌరికి రూ.3 లక్షల కార్యకర్తల నిధి మంజూరైంది. ఈ నగదును బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో బాలశౌరికి నసీర్ అందించారు.

ఆర్వీఆర్అండ్‌జేసీలో దంతవైద్య శిబిరం



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మెగా దంత వైద్యశిబిరం నిర్వహించారు. సిబార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ ఆర్థోడెంటిక్స్ విభాగం ప్రొఫెసర్ అండ్ హెడ్ డాక్టర్ పి.రేవతి ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించారు. వైద్యశిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, పిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్, వైద్య నిపుణుల బృందం డాక్టర్ పి.శరవణ్, డాక్టర్ సంజీవ్, డాక్టర్ అరుణ, డాక్టర్ అపర్ణ, డాక్టర్ హెబ్సీబా పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై బీజేపీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన



ఉగ్రదాడికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేస్తున్న బీజేపీ నాయకులు

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 23 (ఆంధ్ర జ్యోతి): పహల్గామ్‌లో అమాయక ప్రజలపై జరిగిన ఉగ్రవాద దాడి హేయమని బీజేపీ నాయకులు అన్నారు. దాడికి వ్యతిరేకంగా బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక లాడ్జి సెంటర్ నుంచి శంకర్‌విలాస్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ దేశ చరిత్రలో చీకటి రోజుగా మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ అమాయక పౌరుల త్యాగం వృథా కాదని, దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు, ఆశ్రయం కల్పించిన వారికి సరైన బుద్ధిచెబుతామని స్పష్టం చేశారు. సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు, భీమినేని చంద్రశేఖర్, ఈదర శ్రీనివాసరెడ్డి, చరక కుమార్‌గౌడ్, డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, నేరళ్ళ మాధవరావు, మంత్రి సుగుణ పాల్గొన్నారు.

ఉగ్రవాదులది పిరికిపంద చర్య

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పహల్గామ్ యాత్రికులపైన విచక్షణా రహితంగా కాల్పులు జరిపి హతమార్చిన ఉగ్రవాదులది పిరికిపంద చర్యగా విద్యార్థి, యువజన సంఘాల నాయకులు అభివర్ణించారు. స్థానిక శంకర్‌విలాస్ సెంటర్లో ఉగ్రవా దుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాసర్‌జీ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వలీ, జంగాల చైతన్య, యశ్వంత్, బన్నీ, అరుణ్, బాజీ, కాలం, రెహ్మాన్, ఖదరావలీ తదితరులు పాల్గొన్నారు

వైసీపీ నేతలు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ

గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాద దాడులు అత్యంత హేయమని, ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు కోరారు. ఉగ్రవాద దాడులను నిరసిస్తూ వైసీపీ నేతలు అంబటి రాంబాబు, మాజీ ఎంపీ మోదు గుల వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు తదితరులు కొవ్వొత్తులతో బృందావన్‌గార్డెన్స్‌లోని వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయం నుంచి గార్డెన్స్ సెంటర్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు.

పర్యాటకులపై ఉగ్రదాడి దారుణం : వద్రాణం




వద్రాణం హరిబాబు

గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా పహల్గాం సమీపంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి హతమార్చడం దుర్మార్గమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వద్రాణం హరి బాబు అన్నారు. ఆ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అమాయకుల ఉసురు తీసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని అన్నారు. ఉగ్ర దాడిలో 28 మంది చనిపోవడం, పదుల సంఖ్యలో క్షతగాత్రులు కావడం ఆందోళనకరమన్నారు. కొన్నాళ్లుగా ప్రశాంతంగా ఉన్న కశ్మీర్ ఇప్పుడు రక్తసిక్తం కావడం బాధాకరమన్నా రు. దాడికి బాధ్యులుగా ప్రకటించుకున్న టీఆర్ఎఫ్‌ను సమూలంగా పెకలించివేయాలని ఆయన కోరారు.

టీడీపీ పాలనలో గురువులకు సముచిత స్థానం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు గౌరవం, సముచిత స్థానం టీడీపీ పాలనలోనే సాధ్యపడుతుందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. పుస్తక దినోత్సవాన్ని పుర స్కరించుకుని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు, ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. గోనుగుంట్ల మాట్లాడుతూ లక్ష 96 వేల ఉద్యో గాలు ఇచ్చిన ఘనత టీడీపీ దేనని అన్నారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవ సంస్థ చైర్మన్ రామిరెడ్డి, ప్రత్యూష సుబ్బారావు, వెంకటేశ్వర రావు, కే సతీష్, ప్రకాష్, గ్రంథాలయ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన మహా మంజీర నాదం



మహా మంజీర నాదంను ప్రారంభిస్తున్న మన్నవ సుబ్బారావు, మస్తానయ్య

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ అన్నమయ్య కళా వేదికపై అంతర్జాతీయ నృత్య దినోత్సవం పురస్కరించుకుని శ్రీ సాయి మంజీరా కూచిపూడి ఆర్ట్ ఆకాడమీ ఆధ్వ ర్యంలో వారం రోజుల పాటు జరిగే మహా మంజీర నాదం కార్యక్రమం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య, మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు ప్రారంభించారు. కార్యక్రమానికి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా మోదుగుల రవికృష్ణ, అక్కిరాజు శ్రీహరిబాబు హాజరై మేలట్టూరు శ్రీకాంత్ నటరాజన్‌ను అక్కిరాజు మణి ప్రియస్మారక సాత్రాజితి పురస్కారం, ఏలూరు జయశ్రీ, దంగేటి సాత్వికలను ఖాజా వేంకట సుబ్రహ్మణ్యం ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీకాంత్ నటరాజన్ మేలట్టూర్ సంప్రదాయ నృత్యాన్ని, దంగేటి సాత్విక ఆంధ్ర నాట్యం, ఏలూరి జయశ్రీ కూచిపూడి నాట్యాన్ని ప్రదర్శించి కళాభిమానులను సమ్మోహనపరిచారు.

పది ఫలితాల్లో నగర విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో సీవీ రేణుక

గుంటూరు(విద్య), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీవో కాలనీలోని శ్రీకోనబాల ప్రభాకరరావు మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ (ఎస్‌కేబీపీఎంఎస్) విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తాచాటారని హెచ్‌ఎం పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠ శాల విద్యార్థులు 89శాతం ఉత్తీర్ణతతో మొదటి స్థానం సాధించినట్లు వెల్లడించారు. పాఠశాలలో మొత్తం 139 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 124 మంది ఉత్తీ ర్ణత సాధించారు. 577 మార్కులతో సాహు చిన్మయి, 576 మార్కులతో బావజ్ఞ, 567 మార్కులతో బి.గోపి, 15 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని వివరిం చారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను డీఈవో సీవీ రేణుక తన కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి ఏసురత్నం, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు, విజయానంద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు

స్థానిక చౌత్రాసెంటర్లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు పదో తరగతి ఫలితాల్లో సత్తాచాటారని ఇన్‌చార్జీ హెచ్‌ఎం ఎస్‌కే ఎండీ ఖాసిం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యధిక మార్కులు 573 సాధించిన విద్యార్థిని నాగసాయి రోషిణిని అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు ఎండీ ఖాసీం మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో 13 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించటంతోపాటు కొన్ని సబ్జెక్టుల్లో విద్యార్థులు నూటికి నూరుశాతం మార్కులు సాధించారని అన్నారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యున్నత ఫలితాలు సాధించడంపై స్థానిక ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్, జిల్లా విద్యా శాఖాధికారి సీవీ రేణుక, ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు.

పది ఫలితాల్లో శ్రీచైతన్య టెక్నో ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ అంజయ్య

గుంటూరు (విద్య), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో శ్రీ చైతన్య టెక్నో స్కూల్స్ విద్యార్థులు విజయభేరి మోగించాలని డాక్టర్ నూతలపాటి అంజయ్య వెల్లడించారు తమ విద్యార్థులు 3105 మంది పరిషత్ హాజరుకాగా 96శాతం ఫలితాలు సాధించినట్లు వివరించారు. 595 పైగా మార్కులు సాధించిన వారు 13 మంది, 590 పైగా మార్కులు సాధించిన వారు 88 ఉన్నారని వివ రించారు. తమ విద్యార్థులు పెదపాటి వెంకట నాగసాయి కృత్తిక, ఆలపాటి జ్యోతిర్మయి, దమ్మాటి లక్ష్మీ సాత్విక తదితరులు 597 మార్కులు సాధించారని తెలిపారు. అదేవిధంగా గణితం సబ్జెక్టులో 353 మంది, సైన్స్ సబ్జెక్టుల్లో 153 మంది నూటికి నూరు మార్కులు సాధించినట్లు వివరించారు. విద్యార్థులను శ్రీచైతన్య ఆర్ఐ అప్పాజీ, హెచ్ సురేంద్ర తది తరులు అభినందించారు.

పది ఫలితాల్లో శ్రీవిజేత స్కూల్ విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న చెరుకూరి శ్రీహరి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఏటీ అగ్రహారంలోని శ్రీవిజేత స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని డైరెక్టర్ చెరుకూరి శ్రీహరి బుధవారం తెలిపారు తమ పాఠశాల విద్యార్థిని కే.గాయత్రి 592 మార్కులతో అగ్రస్థానంలో నిలిచినట్లు తెలిపారు. అదేవిధంగా సీహెచ్ ప్రణతి 584, యూఎంఈ రెహన్ 579, అతికూర్ రెహమాన్ 575, ఎస్‌కే ఖాజా కరీం 574 మార్కులు సాధించారని వివరించారు విద్యార్థులను పాఠశాల డైరెక్టర్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పిడికిటి తిలక్‌బాబు తదితరులు

పదోతరగతి ఫలితాల్లో ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బా బు బుధవారం ఒక ప్రక టనలో తెలిపారు. తమ విద్యార్థి అప్పికట్ల శ్రీచర్ అత్యధికంగా 594 మార్కులు సాధించాడని తెలిపారు. లంకా మేఘన 592, గుంటూరు విద్యానగర్ బ్రాంచి నాగలింగం హోరా షణ్ముఖ సాయి రఘురామ్ 591 మార్కులు సాధించారని తెలిపారు. తమ సంస్థల నుంచి హాజరైనవారిలో వరుసగా 589, 587, 586, 585, 584, 582, 581 మార్కులు సాధించినట్లు వివరించారు. ఇంకా 550 మార్కు లుపైగా సాధించిన వారు 75 మంది, 500 మార్కులుపైగా సాధించినవారు 89 మంది ఉన్నారు. గుంటూరు నుంచి పరీక్షకు హాజరైన 106 మంది విద్యార్థుల్లో 94మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యా రని తెలిపారు. విద్యార్థులను పాఠశాల కార్యదర్శి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సీఈవో ఎం ఎస్‌బోస్, ప్రిన్సిపాల్స్ వి.నవీన్‌చౌదరి, కె.బాలకృష్ణ, ఏజీఎం భానుప్రసాద్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

పది ఫలితాల్లో బాసర స్కూల్ ప్రభంజనం



విద్యార్థిని అభినందిస్తున్న సాధినేని మురళీమోహన్‌రావు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో స్థానిక బాసర స్కూల్ విద్యా ర్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని చైర్మన్ సాదినేని మురళీ మోహన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఎస్‌కే సాదిక 577, జీ త్రివేణి 573, బీ శృతి 572, బీ అనుక్ష 570 మార్కులు సాధించారని వివరించారు. విద్యార్థులను డైరెక్టర్ సాధినేని రాధ, కే రాంబాబు, ఆర్ అక్రిమ్, శ్రీలక్ష్మీ, సీహెచ్ అప్పిరెడ్డి తదితరులు అభినం దించారు.

బండ్లమూడి హనుమాయమ్మ స్కూల్ విద్యార్థులు

స్థానిక బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ స్కూల్ విద్యార్థినులు పది ఫలితాల్లో ఉత్తమ ప్రతభ చూపారని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌కే జరీనా 586 మార్కులు, జీ శ్రీలతిత సహస్ర 584, ఎస్‌కే ఫౌజియానాజ్ 580, ఎస్‌కే హఫ్సాఅబ్బల్ 579, డీ బాలాత్రిపురసుందరి 575, ఎస్‌కే సబీహానౌషిన్ 575 మార్కులు సాధించారని వెల్లడించారు. పాఠశాలలో 500 మార్కులుపైగా 18 మంది విద్యార్థినులు సాధించినట్లు వివరించారు.

సుమేధ స్కూల్ విద్యార్థుల విజయభేరి

స్థానిక ఎన్జీవో కాలనీలోని సుమేధ స్కూల్ విద్యార్థులు పదిలో ఉత్త మ ఫలితాలు సాధించారని డైరెక్టర్ ఎం.చంద్రశేఖరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీ వైష్ణవి, నాగమనోహర్ 575 మార్కులు, టీ రామచరణ్, కే బాలనవీన్, రేణుశ్రీ 574 మార్కులు సాధించారని వివరించారు. తమ విద్యార్థులు 570పైగా ఏడుగురు, 550పైగా 16 మంది, 500పైగా మార్కులు 37 మంది సాధించారని వివరించారు. మొత్తం 95 మందిలో 81 మంది ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

శ్రీ పూజిత విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి

పదో తరగతి ఫలితాల్లో స్థానిక పట్టాభిపురంలోని శ్రీపూజిత స్కూల్ విద్యార్థులు విజ యభేరి మోగించారని ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థులు కే సంతోష్ 591, టీ సమితా సాయిశ్రీ 586, కే నాగషణ్ముఖ 581 మార్కులు సాధించారు. ఇందులో 550పైగా మార్కులు ఆరు మంది, 500పైగా మార్కులు 14 మంది సాధించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

పదిలో వీఆర్ స్కూల్ విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరావు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితా ల్లో స్థానిక పాత గుంటూరులోని వీఆర్ హైస్కూల్ విద్యార్థులు ఉత్త మ ఫలితాలు సాధించారని డైరెక్టర్ వెలిశెట్టి వెంకటేశ్వరరావు ఒక ప్రక టనలో తెలిపారు. తమ విద్యార్థులు నూతలపాటి సుజిత 592 మార్కులు, వెన్నాకుల ధృతి 589, బలగ తెసిఫ్‌కుమార్ 587, షేక్ యాసిన్ 586, బుద్ధవరపు కావ్యాంజలి 586 మార్కులు సాధించారని తెలిపారు. పరీక్షకు హాజరైన ప్రతి ఇద్దరిలో ఒకరు 500పైగా మార్కులు సాధించి నట్లు వివరించారు. పాఠశాల నూరుశాతం ఉత్తీర్ణత నమోదు చేసిన ట్లు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించా రు.

పదిలో విజేత ఐఐటీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



డి.లక్ష్మీజాహ్నవి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్లలోని విజేత ఐఐటీ ఫౌండేషన్ స్కూల్ విద్యార్థిని డి.లక్ష్మీజాహ్నవి 593 మార్కులు సాధించినట్లు డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా 22 మంది విద్యార్థులు 575పైగా మార్కులు, 60 మంది 550పైగా, 128 మంది 500పైగా మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

చైన్ స్నాచింగ్స్‌కు పాల్పడుతోన్న మామ, అల్లుడు అరెస్టు

● 20 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : చైన్ స్నాచింగ్స్‌కు పాల్పడుతోన్న మామ, అల్లుడిని నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. లక్షా 50 వేల విలువైన 20 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ భానోదయ తెలిపారు. నల్లపాడు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాతగుంటూరు యాదవబజారుకు చెందిన బాణావత్ బద్రు నాయక్, మాచర్ల మండలం చింతలతండాకు చెందిన కేతవత్ శరత్‌లు ఈ చైన్ స్నాచింగ్ దోపిడికి పాల్పడినట్లు సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా పోలీసులు గుర్తించారన్నారు. ఏటుకూరు బైపాస్ వద్ద బుధవారం వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించి స్నాచింగ్ చేసిన ఆభరణాలు పోలీసులకు అప్పగించారన్నారు. ఈ విచారణలో నిందితులు ఇద్దరు మేనమామ - మేనల్లుడు అని, వారు గుంటూరు నగరంలో ఆటోలు నడుపుతూ జీవిస్తుంటారని, వ్యసనాలకు అలవాటు పడి వచ్చే సంపాదన సరిపోక చైన్‌స్నాచింగ్ చేసి డబ్బులు సంపాదిద్దామనే దురాలోచనతో మొదటిసారి చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు చెప్పారు. కేసును కేవలం ఐదు రోజుల్లో ఛేదించిన నల్లపాడు సీఐ వంశీధర్, ఎస్సై వాసు, వారి సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు, కానిస్టేబుళ్ళు మస్తాన్ వలి, యూరుల్లా, వారికి దిశానిర్దేశం చేసిన సౌత్ డీఎస్పీ భానోదయను ఈ సందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించా లని, క్వాలిటి కంట్రోల్ సిబ్బంది, ఎమినిటి కార్యదర్శులు పర్యవేక్షించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశిం చారు. బుధవారం కమిషనర్ పాత గుంటూరు, మారుతీనగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి పనులను తని ఖీ చేసి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, అభివృద్ధి పనులు జరిగే సమయంలో దశల వారీగా క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది రికార్డు చేయాలన్నారు. ఎమినిటి కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పనులను ప్రతి రోజు పరిశీలించాలన్నారు. పర్యటనలో ఏఈ పిడుగురాళ్ళ వెంకటేశ్వర రావు, ఎస్ఎస్ అయూబ్ ఖాన్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయాల కార్య దర్శులు పాల్గొన్నారు. అన్నక్యాంటీన్లను నోడల్ అధికారు లు ప్రతి రోజు పరిశీలించాలని కమిషనర్ ఆదేశించారు. నల్లచెరువు వద్ద గల అన్న క్యాంటీన్‌ను పరిశీలించి ఆహారం తీసుకుంటున్న వారితో కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడారు.

పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి

● ఈడీ విశ్వశ్రీకి వినతిపత్రం అందజేత

గుంటూరు సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోళ్లలో పోటీ తీసుకుని వచ్చి రైతులకు గిట్టుబాటు ధర అందేలా చూడాలని పలువురు బుధవారం గుంటూరులోని బోర్డు కార్యాలయంలో ఈడీ విశ్వశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ ఫిబ్రవరి నుంచి పొగాకు కొనుగోళ్లు ఆరంభం కాగా వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర తగ్గిస్తున్నారని అన్నారు. కర్ణాటకలో వ్యాపారులు మేలు రకం పొగాకును కేజీ రూ.360లకు కొనుగోలు చేయగా ఆంధ్రప్రదేశ్‌లో మా త్రం రూ.240లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని అన్నారు. రైతులు వేలా నికి తీసుకుని వచ్చిన పొగాకులో 40 శాతం పొగాకును నేబిడ్ పేరుతో కొను గోలు చేయకుండా వెనక్కు తిప్పి పంపుతున్నారని అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రైతులకు గిట్టుబాటు ధరలు లేక నష్టాల పాలయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈడీకి వినతిపత్రం అందజేసిన వారిలో మారెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజా గ్రీవెన్స్‌లో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, పక్కన కార్పొరేటర్లు, టీడీపీ నేతలు

కుక్కలు దాడి చేస్తే అధికారులదే బాధ్యత : ఎమ్మెల్యే మాధవి

● మాంసపు వ్యర్థాలు పడేసే వారిపై చర్యలు తీసుకోవాలి

● గ్రీవెన్స్‌డేలో అర్జీలు స్వీకరణ

గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పశ్చిమ నియోజకవర్గంలో ప్రజల మీద కుక్కలు దాడి చేస్తే మున్సిపల్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి తేల్చి చెప్పారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ప్రజలు, అధికారుల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. పలు సమస్యలపై సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సీఎం ఆదేశాలతో ప్రతి బుధవారం గ్రీవెన్స్‌డే నిర్వహించి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, అభివృద్ధి కార్యక్రమాలకు పాతర వేసిందన్నారు. రోడ్లు, డ్రైన్లు, వీధి లైట్లు, కుక్కల బెడద, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తుతున్నాయన్నారు. కమిషనర్, మున్సిపల్ అధికారుల సహకారంతో త్వరగా వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తున్నామన్నారు.

● కుక్కల బెడదపై.. సీరియస్

కుక్కల బెడద గురించి మున్సిపల్ కౌన్సిల్ దృష్టికి తీసుకొని వెళ్లినప్పుడు కుటుంబ నియంత్రణ, వ్యాక్సినేషన్ చేస్తున్నామని సమాధానం ఇస్తున్నారు. ఇది కంటి తుడుపు చర్య మాత్రమేనని, అది సమస్యకు పరిష్కారం కాదని అన్నారు. అసలు కుక్కలు ఇలా జనం మీద దాడి చేయటానికి ప్రధాన కారణం వాటికి సరైన ఆహారం, నీరు దొరక్కపోవడమేనని, ఆదివారం మాంసపు దుకాణాల వద్ద వ్యర్థాలను ఇష్టానుసారం పడవేయడం వల్ల అవి తిని మతిస్థిమితం తప్పి ప్రజల మీద దాడులు చేస్తున్నాయని అన్నారు. వాటికి ఆసరా కల్పించటానికి జంతు ప్రేమికులు కూడా ముందుకు రావాలని అభ్యర్థిస్తున్నాను. బ్లూక్రాస్, కార్పొరేషన్ అధికారులతో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కుక్కల సమస్యపై అధికారులు దృష్టి సారించాలి, ఏ ఒక్క వ్యక్తి మీద అయిన కుక్క దాడి చేస్తే దానికి మున్సిపల్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎమ్మెల్యే మాధవి సున్నితంగా హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుఖవాసి శ్రీనివాస్, కొమ్మినేని కోటేశ్వరరావు, చంద్రగిరి బాబు, రహీం, గుర్రం ప్ర సాద్, గుంటుపల్లి శేషగిరిరావు, డివిజన్ పార్టీ అధ్యక్షుడు, ఎన్డీయే నేతలు పాల్గొన్నారు.

వైసీపీ మద్యంతో దెబ్బతిన్న ప్రజారోగ్యం : దేగల



దేగల ప్రభాకర్

గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సక్రమంగా అమలవుతున్న మద్యం అమ్మకాల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాల కారణంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటుగా, ప్రభుత్వం భారీగా ఆదాయాన్ని కోల్పోయిందని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. పార్టీ నగర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014- 2019 మధ్య కాలంలో నాణ్యమైన, పార దర్శకమైన మద్యాన్ని అందుబాటులో ఉంచడం వల్ల ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి నష్టం జరగలేదని అన్నారు. 2019-2024 మధ్య కాలంలో పాలసీ మార్పు పేరుతో జరిగిన అక్రమాల కారణంగా పేదలపై ఆర్థికభారం, రెవె న్యూ నష్టం, మద్యం ఆధారిత నేరాలు పెరిగిపోయి బేవరేజస్ కార్పొరేషన్‌పై తీవ్రమైన నేరారోపణలు కూడా వచ్చాయన్నారు.



సూరీడు.. సుర్రు



ఎండ దాటికి గొడుగుతో..

రిక్షా కార్మికుడి జీవన పోరాటం



ఫ్లెక్సీ కప్పుకున్న వృద్ధుడు



ఒకవైపు పైన తలమాడుతోంది.. మరోవైపు కింద భూమి పెనంలా మాడుతుంది.... అయినా కష్టజీవులు జీవన పోరాటం సాగిస్తూనే ఉన్నారు...... కొన్నిచోట్ల విద్యార్థులు చెప్పులు లేక కాలుతున్న ఎండలోనే కాళ్లు బొబ్బలెక్కేల పరిగెడుతూ ఇంటి బాట పడుతున్న వైనం... జగనన్న ఇచ్చిన విద్యా కానుకలో బూట్లు ఏమయ్యాయో తెలియదు పరిస్థితి.. ఇదీ బుధవారం గుంటూరులో కనిపించింది.

-గుంటూరు (ఆంధ్రజ్యోతి)







కాళ్లకు చెప్పులు లేక ఎండ వేడిమికి విద్యార్థుల ఇక్కట్లు

ఒక్కొక్కటిగా.. రైళ్లన్నీ చర్లపల్లికి

● సికింద్రాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి పనులతో రైల్వే శాఖ నిర్ణయం ● ఇప్పటికే ఏడు రైళ్ల టెర్మినల్స్ మార్పు ● మరికొద్ది రోజుల్లో ఇంకొన్ని రైళ్లను మార్చే అవకాశం

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్ నిర్మాణ పనులు కారణంగా గుంటూరు నుంచి వెళ్లే చాలా రైళ్లను చర్లపల్లి స్టేషన్‌లోనే రైల్వే శాఖ ప్రయాణాన్ని నిలిపేస్తున్నది. లింగంపల్లి వెళ్లాల్సిన రైళ్లలో కొన్నింటిని చర్లపల్లి నుంచి సనత్‌నగర్‌కు మళ్లించి ఆ తర్వాత లింగంపల్లికి చేరుస్తున్నది. దీంతో ఎన్నో ఏళ్లుగా ఇక్కడి ప్రయాణికులు సికింద్రాబాద్/హైదరాబాద్ రైల్వేస్టేషన్లలో దిగి వెళ్లేవారు ఇప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఒంటరిగా వెళ్లే యువతులు, మహిళలు చర్లపల్లిలో దిగేసి అక్కడి నుంచి రూంలు/హాస్టల్స్‌కు చేరుకోవడానికి తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. రైల్వే శాఖ చర్లపల్లి టెర్మినల్‌కి రైళ్లను మారుస్తుండటం తాత్కాలికమే అని చెబుతున్నప్పటికీ రాబోయే రోజుల్లో పెరిగే రద్దీ నేపథ్యంలో దానినే శాశ్వతం చేసే అవకాశం లేకపోలేదు.

వారంలో రెండు రోజులు గుంటూరు మీదగా నాగర్‌సోల్ వెళ్లే బైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌ని ఇప్పటికే చర్లపల్లికి మార్చేశారు. అలానే చెన్నై, జన్మభూమి, రేపల్లె, శిల్పార్ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు విల్లుపురం, శ్రీకాకుళం రోడ్డు, కన్యాకుమారి తదితర స్పెషల్స్‌ని కూడా చర్లపల్లికి మార్చేసింది. త్వరలో మరికొన్ని రైళ్ల టెర్మినల్స్‌ని కూడా చర్లపల్లికి మార్చే అవకాశం ఉందని రైల్వేవర్గాల ద్వారా తెలిసింది. చర్లపల్లి రైల్వేస్టేషన్ సికింద్రాబాద్‌కు దాదాపుగా 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అక్కడి నుంచి సిటీ బస్సు సౌకర్యాలు కూడా అంతంత మాత్రమే. ఒక రైలులో దాదాపుగా 1500 మందికి పైగా ప్రయాణికులు అక్కడ దిగుతుంటారు. దీంతో అంతమంది సిటీ బస్సుల్లో గమ్యస్థానాలకు వెళ్లాలంటే చాలా కష్టం. చెన్నై ఎక్స్‌ప్రెస్ వేకువజామున 5.10 గంటలకల్లా చర్లపల్లి చేరుకొంటుంది. అప్పటి నుంచి సిటీ బస్సులు కదలాలంటే కనీసం గంటకు పైగా అక్కడ నిరీక్షించాల్సి వస్తున్నదని ప్రయాణికులు వాపోతున్నారు. ఒకవేళ సికింద్రాబాద్‌లో వీలు పడకపోతే గతంలో వలే హైదరాబాద్(నాంపల్లి)లో టెర్మినేట్ చేస్తే అక్కడి నుంచి మెట్రో/సిటీ బస్సుల్లో గమ్యస్థానాలకు చేరుకోవచ్చని చెబుతున్నారు.

ప్రస్తుతానికి లింగంపల్లి వెళ్లే ఇంటర్‌సిటీ, వందేభారత్, పల్నాడు, విశాఖ, ఫలక్‌నుమా, శబరి, ఎల్‌టీటీ, డెల్టా, నరసపూర్, నారాయణాద్రి, వయా వరంగల్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లు మాత్రమే సికింద్రాబాద్ వెళుతున్నాయి. వీటిల్లో కూడా కొన్నింటిని కొద్ది రోజుల్లోనే చర్లపల్లికి మార్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. అప్పుడు ఇక్కడి నుంచి సికింద్రాబాద్‌కు వెళుతున్న ప్రయాణికులకు కష్టాలు మరింత పెరుగుతాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఎంఎంటీఎస్ రైళ్లను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ప్రధాని పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

● సభా వేదిక వద్దకు చేరుకునేందుకు 8 రోడ్ల గుర్తింపు ● రూ. లక్ష కోట్ల విలువైన పనులను పీఎం మోదీ ప్రారంభిస్తారన్న మంత్రి నారాయణ ● రోడ్ల పనులు అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశం

తుళ్లూరు, గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అమరావతి పనులను పునః ప్రారంభించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చేనెల రెండో తేదీన ప్రధాని హాజరయ్యే సభా ప్రాంగణానికి సంబంధించిన పనులు, సభా ప్రాంగణానికి చేరుకునే రహదారుల పనులు కొద్దిరోజులుగా నిర్విరామంగా సాగుతున్నాయి. ప్రధాని పర్యటన విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఇప్పటికే పలు పనులు తుది దశకు చేరుకున్నాయి.

గతంలో రూ. 5వేల కోట్ల వ్యయం

గతంలో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగానే రాజధాని అమరావతి శంకుస్థాపన జరిగింది. 2014- 19 మధ్య అమరావతి నిర్మాణానికి ఐదువేల కోట్లకుపైగా అప్పటి టీడీపీ ప్రభుత్వం ఖర్చు చేసింది. అనేక భవనాలు, రోడ్లు నిర్మించింది. వాటిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆలిండియా సర్వీస్ ఉద్యోగుల భవనాల పనులు 80 శాతానికిపైగా పూర్తయ్యాయి. అనేక రహదారుల నిర్మాణం కూడా జరిగింది. కానీ గత ప్రభుత్వం రాజధాని విషయంలో మూడు ముక్కలాటాడి, ఎక్కడా రాజధాని లేకుండా నిర్వీర్యం చేసింది. అమరావతి ప్రాంతాన్ని అడవిలా మార్చేసింది. కూటమి ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబు అమరావతిలో పర్యటించి వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఆ నేపథ్యంలోనే రూ.64 వేల కోట్లతో టెండర్లు పిలవడానికి సీఆర్డీఏ అథారిటీలో నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకూ రూ.41 వేల కోట్ల పనులకు టెండర్లు పూర్తయి



ప్రధాని సభ వద్ద చదును చేస్తున్న భారీ యంత్రాలు



రెడీ చేస్తున్న వెస్ట్‌బైపాస్

పనులు కూడా ప్రారంభమయ్యాయి. ప్రధాని చేతుల మీదుగా ఈ పనులను లాంఛనంగా పునఃప్రారంభించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించడంతో అందుకనుగుణంగా అమరావతిలో ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి.

● 1.1 కి.మీ మేర రోడ్ షో.. 5లక్షల మందితో సభ

వచ్చే నెల రెండో తేదీన ప్రధాని మోదీ అమరాతికి రానున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకుం టారు. అక్కడి నుంచి అమరావతికి వచ్చి 1.1 కిలోమీటర్ల మేర రోడ్ షోలో పాల్గొని బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సభ జరుగుతుంది. సుమారు 5 లక్షల మంది ప్రజలు సభకు వస్తారని అంచనా వేస్తున్నామని, అందుకు తగినట్లుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ- 11, ఈ- 13, ఈ- 15 రోడ్లతో పాటు సీడ్ యాక్సిస్ రోడ్డు నుంచి రాకపోకలు జరుగుతాయి. ఇప్పటికే పోలీస్ శాఖ రోడ్లు పరిశీలించి గుంతలు పూడ్చాలని కోరింది. ప్రధాని సభకు వచ్చే వాహనాల కోసం మొత్తం 11 పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటుచేస్తున్నారు. మొ త్తం 8 రోడ్ల ద్వారా సభా వేదిక వద్దకు చేరుకునేలా రవాణా ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళగిరి నుంచి రెండు రోడ్లు, తాడేపల్లి నుంచి ఒకటి, వెస్ట్ బైపాస్ నుంచి ఒకటి, ప్రకాశం బ్యారేజి నుంచి రెండు,

తాడికొండ నుంచి ఒకటి, హరిశ్చంద్రాపురం నుంచి ఒక రోడ్డు ద్వారా సభా వేదిక వద్దకు చేరుకోవచ్చు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ జామ్ కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పోలీస్ శాఖ సూచనల మేరకు రెండు రోజుల్లోగా రోడ్లన్ని సరిచేయాలని సీఆర్డీఏ అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు.

5 లక్షల మందికి తగ్గట్లుగా ఏర్పాట్లు: మంత్రి నారాయణ

అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి 5 లక్షలమంది హాజరవుతున్నారని అంచనా వేస్తున్నామని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి నారాయణ తెలిపారు. రాజధాని అమరావతిలో వచ్చే నెల రెండో తేదీన జరగనున్న ప్రధాని పర్యటన, సభ ఏర్పాట్లను రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరి నారా యణ బుధవారం పరిశీలించారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి రెండుగంట లపాటు రాజధానిలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించిన ఆయన ప్రధాని సభ నేపథ్యంలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే సభావేదిక వద్దకు వెళ్లేం దుకు అవసరమైన రోడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మే రెండో తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ప్రధాని గన్నవరం ఎయిర్ పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి అమరావతికి వచ్చి 1.1 కిలోమీటర్ల మేర రోడ్ షోలో పాల్గొని బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారని, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ సభలో పాల్గొంటారని తెలిపారు. ఈ సభకు సుమారు 5 లక్షల మంది ప్రజలు వస్తారని అంచనా వేస్తున్నామని, అందుకు తగినట్లుగా ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. సభ నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ప్రజల రాకపోకలకు మొత్తం 8 రోడ్లను, 11 పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

గ్రామాలను చెత్త రహితంగా మారుద్దాం

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



చేబ్రోలులోని సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ వద్ద అధికారులతో కొమ్మారెడ్డి పట్టాభిరామ్

పొన్నూరుటౌన్(చేబ్రోలు) ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గ్రామాలను చెత్త రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. చేబ్రోలులోని సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను బుధవారం కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తనిఖీ చేశారు. ప్లాంట్‌లో ఉన్న వివరాలు,యాప్‌లో నమోదు చేసిన వివరాలకు వ్యత్యాసం ఉండడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంపద సృష్టి కేంద్రాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యంగా కారణంగా రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్త పేరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణ ప్రాంతాలలో చెత్తను తొలగించే పనులు చేపట్టినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో డ్రోన్ సర్వేల ద్వారా చెత్తను తొలగించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. చెత్త సెగ్రిగేషన్ విషయంలో ఖచ్చిత మైన డేటాను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసేలా కృషి చేస్తామన్నారు. గ్రామ పంచాయతీలు సైతం ఇంటింటి నుంచి చెత్తను సేకరించి ప్రాసెస్ చేస్తున్నట్లు చెప్పారు. పీఆర్1 యాప్ ద్వారా ప్రతి గ్రామ పంచాయతీలో సందప సృష్టి కేంద్రాల నిర్వహణను పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. గురువారం జరగబోయే జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీవో సాయికుమార్, ఎంపీడీవో ఉమాదేవి, ఈవోపీఆర్డీ ఉషారాణి, టీడీపీ మండల అధ్యక్షుడు షైలా రామరాజు, జనసేన అధ్యక్షుడు చందు శ్రీరాములు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మండు వేసవిలో ఊరిస్తున్న తాటి ముంజలు

చిలకలూరిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలో తాటి ముంజల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. బాపట్ల జిల్లా కోలలపూడి, బొల్లాపల్లి ప్రాంతాల నుంచి ఆటోలలో తీసుకువచ్చి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విక్రయిస్తున్నారు. ప్రధానంగా స్థానిక నరసరావుపేట సెంటర్లో డివైడర్లపై వీటి విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఒక్కొక్క తాటికాయలో మూడు ముంజలు ఉంటాయి. తాటికాయ ధర రూ. 20 వరకు పలుకుతున్నది. తాటికాయల నుంచి ముంజలను తీశాక వచ్చే వ్యర్థాలను ఆటోలలో తిరిగి తీసుకువెళుతున్నారు. వాటిని గేదెలు, ఎద్దులు ఎంతో ఇష్టంగా తింటాయని ముంజల విక్రయిదారులు చెబుతున్నారు.

తాటి ముంజలతో ఎన్నో ప్రయోజనాలు

ఎటువంటి రసాయనాల ప్రభావం లేకుండా సహజ సిద్ధంగా లభించే తాటికాయలలోని ముంజలు పోషకాల పరంగా, ఆరోగ్య పరంగా ఎంతో మంచి ఆహారం. వేసవిలో తాటి ముంజలు తింటే శరీర ఉష్ణోగ్రతను తగ్గించి చల్లదనాన్ని ఇస్తాయి. ముంజలలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల శరీరానికి తక్షణ శక్తినివ్వడమే కాకుండా శరీరం డీహైడ్రేషన్ అవ్వకుండా ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉన్న కారణంగా ఇవి జీర్ణక్రియకు కూడా సహాయపడతాయి. మలబద్దకం వంటి సమస్యలను తగ్గిస్తా యి. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. వీటిలో పొటాషియం, కాల్షియం, ఐరన్ వంటి ఖనిజాలతో పా టు బీ, సీ విటమిన్లు ఉంటాయి. కాకపోతే ఒకే రోజు, ఒకే విడత వీటిని ఎక్కువ మొత్తంలో తినకూ డదు. రోజుకు100 గ్రాముల వరకు తినొచ్చు.100 గ్రాముల ముంజల్లో 43 కేలరీలు లభిస్తాయి.11 గ్రాముల కార్బోహైడ్రేట్లు అందుతాయి. ఇక పిల్లలకు పాలిచ్చే తల్లులు ముంజలను తినడం మంచిది. ఇవి తల్లిపాలను వృద్ధి చేస్తాయి. వేసవిలో తాటి ముంజలు తినడం ఆరోగ్యానికి అన్ని విధాలా మంచిది.



మొక్కజొన్న పేరుతో మెక్కేస్తున్నారు

(5వ పేజీ తరువాయి)

వారు కప్పం కట్టాల్సిన పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఒక్కో ర్యాక్‌కు రూ. 2 లక్షల వరకు వసూలు చేస్తూ వచ్చారు. దీని వెనుక అప్పట్లో మార్కెటింగ్ శాఖలో పనిచేస్తున్న ఇద్దరు కిందిస్థాయి ఉద్యోగులు కూడా ఉన్నారనే ప్రచారం ఉంది. వారిని అడ్డుపెట్టుకుని ఒకే వ్యక్తి ర్యాక్‌లు బుక్ చేయటం, ఒకవేళ అతనితో సంబంధం లేకున్నా వ్యాపారులే బుక్ చేసుకున్నా, దానిలో సరకు లోడ్ చేయాలన్నా, ర్యాక్ కదలాలన్నా కప్పం కట్టాల్సిందేనని హుకుం జారీ చేశారు. దీనికి అప్పటి వైసీపీ నేతలు కూడా అండగా నిలిచారనే ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు ఆ కప్పం కంపు కూటమి నేతలకూ పులుముతున్నారు. అడ్వాన్స్‌డ్ ర్యాక్‌ల బుకింగ్‌తో అక్రమ దందాకు రంగంలోకి దిగిన కొందరు వ్యాపారులు కూటమి నేతల పేర్లుచెప్పి మరీ బహిరంగంగానే వసూళ్లకు దిగుతున్నారు. తెలుగుదేశం, జనసేన, నేతల పేర్లు చెప్పి వసూళ్లకు తరలీశారు. ఇవన్నీ మాకు కాదని, నేతలకు కట్టాల్సిందేనంటూ బహిరంగంగానే చెప్పటం కొసమెరుపు.

ర్యాక్‌ల ద్వారా రూ. కోటిన్నర లక్ష్యంగా...

పంట పండించలేదు.. పండించిన రైతుల దగ్గర నుంచి డబ్బుపెట్టి సరకు కొననూలేదు. కేవలం అధికార పార్టీల అండే వారికి దందాకు ఊతంగా మారింది. వైసీపీ ప్రభుత్వ కాలంలో కప్పం వ్యవహారం కంపు కొట్టినా, అధికార పార్టీ నేతలు సంపాదనే లక్ష్యంగా రూ. కోటిన్నర కోసం టార్గెట్ పెట్టుకుని వసూళ్ల దందాకు దిగారనేది వ్యాపారుల ఆరోపణ. ఒక్క తెనాలి నుంచే మొక్కజొన్న, జొన్న లోడుతో ఏటా ఏప్రిల్ నుంచి జూన్ వరకు 35 నుంచి 40 వరకు ర్యాక్‌లు ఇతర రాష్ట్రాలకు వెళ్లటం పరిపాటి. కేవలం దీనిపైనే రూ. కోటిన్నర లక్ష్యంగా పెట్టుకున్నారో! లేక గత వైసీపీ ప్రభుత్వంలో వసూళ్ల రాయుళ్లను మంచివాళ్లను చేద్దామనుకున్నారో కానీ, ఈ ఏడాది ఒక్కో ర్యాక్‌కు తమ సొంత ఎగుమతి సుంకాన్ని రూ. 3 నుంచి రూ. 4లక్షల వరకు పెంచేశారు. ఒకే ఏడాది అంత మొత్తంలో అనధికార వసూళ్లు పెంచేయటంతో వ్యాపారుల్లో నిరసన వ్యక్తమయింది. అదేమని ఎవరైనా అడిగినా ఇవన్నీ మాకు కాదని, పార్టీ నేతలకు పంపాలంటూ ఏలూరు, తెనాలి, బాపట్ల జిల్లాల నుంచి వచ్చిన వ్యాపారులు, వసూలు రాయుళ్లు చెప్పుకురావటం విశేషం. అంటే అన్ని ర్యాక్‌లకు కలిపి రూ. కోటిన్నర వరకు వసూలు టార్గెట్‌గా పెట్టిమరీ వసూలు చేస్తున్నారని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిట్లా ఉంటే.. ఇక్కడి నేతలు, ఇక్కడి వ్యాపారులు చాలరన్నట్టు ఏకంగా ఏలూరుకు చెందిన నేత పేరుకూడా తెరపైకి ఓ వ్యాపారి తీసుకురావటంతో స్థానిక వ్యాపారులు విస్తుపోతున్నారు. ఇదంతా ఆయా పార్టీల నేతలకు తెలుసో! లేదో! కానీ ఇక్కడ వ్యాపారులు మాత్రం తెనాలి అడ్డాగా కొందరు కూటమి నేతలకు పనికట్టుకుని మరీ చెడ్డపేరు తీసుకొస్తున్నారు. అయితే ఇప్పటికైనా నేతలు మేల్కొని ఈ అక్రమ వసూళ్ల దందాకు తెరదింపుతారో లేదో!.


ప్రణాళికాబద్ధమైన కృషితోనే..

● పదో తరగతిలో అత్యధిక మార్కులు
● స్కీమ్ ఆఫ్ వాల్యుయేషన్‌పై అవగాహన ఉండాలి
● విద్యార్థుల మనోగతం వారి మాటల్లోనే...

ఆ విద్యార్థులు పదిలో మెరుగైన ఫలితాలు సాధించారు... దీని వెనుక వారు ప్రణాళికాబద్ధంగా చేసిన కృషి, ప్రతిరోజు సబ్జెక్టుల్ని పునఃశ్చరణ చేసుకోవడం....పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన స్కీమ్ ఆఫ్ వాల్యుయేషన్‌ను అనుసరిస్తూ పరీక్షలకు సిద్ధం అయ్యారు. అత్యుత్తమ మార్కులు వారు కైవసం చేసుకున్నారు. ఒక్కో సబ్జెక్టులో 98శాతంపైగా ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలిచారు. ఇలా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల్ని ఆంధ్రజ్యోతి పలకరించింది. ఆ వివరాలు వారి మాటల్లోనే...

-గుంటూరు(విద్య), ఆంధ్రజ్యోతి

ప్రారంభం నుంచే పునఃశ్చరణ



పది తరగతులు ప్రారంభం అయిన నాటి నుంచే ప్రతిరోజు పూర్తయిన పాఠాల్ని పునఃశ్చరణ చేసుకుంటూ పరీక్షలకు సిద్ధం అయ్యాను. ప్రశ్నలకు జవాబులు రాసే విధానంపై ఉపాధ్యా యులు ఇచ్చిన సూచనలు ఉపయోగ పడ్డాయని పదిలో 598 మార్కులు సాధించిన గుంటూరులోని చౌత్రా సెంటర్‌కు చెందిన పీవీఎస్ఎస్ శ్రీహసిని తెలిపారు. ఇంటర్‌లో ఎంఈసీ తీసుకుని సీఏ పూర్తిచేయడమే లక్ష్యమని వెల్లడించారు.

-పీవీఎస్ఎస్ శ్రీహసిని


ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యం.....



ఇంటర్‌లో ఎంపీసీ పూర్తిచేసి జేఈఈ పరీక్షలో ర్యాంకు సాధించి ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యమని పదిలో 597 మార్కులు సాధించిన ఆలపాటి జ్యోతిర్మయి తెలిపారు. పదిలో సబ్జెక్టుల వారీగా ప్రణాళికతో చదివినట్లు తెలిపారు. ప్రతి అంశాన్ని వదలిపెట్టకుండా పునఃశ్చరణ చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు నాగసురేష్, దుర్గాదేవి పరీక్షల సమయంలో ఎంతో సహకరించారని వివరించారు.

-ఆలపాటి జ్యోతిర్మయి


సివిల్స్ చదవడమే లక్ష్యం...



ఇంటర్ తరువాత బీటెక్ పూర్తి చేసి సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమౌతానని పదిలో 594 మా ర్కులు సాధించిన గుంటూరు లోని శ్రీనివాసరావు పేటకు చెందిన ఆళ్ళ యామిని విద్యాధరి వెల్లడించారు. ఇందు కోసం మరిం త కష్టపడి చదువుతానని చెప్పారు. లక్ష్యసాధన కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా శక్తివంచన లేకుండా శ్రమిస్తానని చెప్పారు.

-యామిని విద్యాధరి

ఐఐటీలో బీటెక్ చేయడమేలక్ష్యం



ఇంటర్ తరువాత జేఈఈ అడ్వాన్స్ ద్వారా ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యమని పదిలో 593 మార్కులు సాధించినట్లు చారుణ్య తెలిపారు. పదిలో సబ్జెక్టుల్ని పూర్తిగా అవగాహన చేసుకోవడంతో పాటు ఎప్పటి పాఠాలు అప్పుడు పూర్తిచేయడం, పాఠశాలలో నిర్వహించే పరీక్షల్లో తప్పులు తెలుసుకుని తుది పరీక్షలకు సన్నద్ధం అయినట్లు వివరించారు. చారుణ్య తెలిపారు.

-చారుణ్య

పశ్చిమ డెల్టాకు 1216 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపశ్చిమడెల్టా పరిసరాల్లో తాగునీటి అవసరాల కోసం చెరువులు, బావులు నింపుకునేందుకుగానూ, ప్రకాశం బ్యారేజి నుంచి 1216 క్యూసెక్కుల నీటిని బుధవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా రేపల్లె కాల్వకు 170 క్యూసెక్కుల నీరు, తూర్పుకాల్వకు 70, పశ్చిమ కాల్వకు 40, నిజాంపట్నంకాల్వకు 64, కొమ్మమూరుకాల్వకు 554 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, ఏప్రిల్ 23: స్థానిక పసుపు మార్కెట్‌యార్డులో బుధవారం జరిగిన వేలంలో 526 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.11,600, గరిష్ఠధర రూ.12,000, మోడల్‌ధర రూ.11,900 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.11,200, గరిష్ఠధర రూ.12,000, మోడల్‌ధర రూ.11,900 పలికాయి.

టీడీపీ కార్యకర్తలపై దాడులకు నిరసన

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఒంగోలులో దారుణ హత్యకు గురైన టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి హత్యను నిరసిస్తూ బుధవారం మండలంలో పుల్లడిగుంట గ్రామంలో తెలుగుసేన ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ స్థూపం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆనాడు - ఈనాడు వైసీపీ కిరాతకుల చేతిలో టీడీపీ కార్యకర్తలు దారుణంగా బలవ్వటం శోచనీయమని, కూటమి నాయకులు ప్రధానంగా ముఖ్యమంత్రి అభివృద్ధితో పాటు కార్యకర్తలను రక్షించుకోవడంపై దృష్టి పెట్టాలని అలాగే వీరయ్య చౌదరిని దారుణంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

పది ఫలితాల్లో సత్తా చాటిన మంగళగిరి విద్యార్థులు

మంగళగిరి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంగళగిరి వీవర్స్ కాలనీ మున్సిపల్ హైస్కూల్‌లో 256 మంది విద్యార్థులకుగాను 179 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. పంది వరుణ్ సాయి 591, జొన్నాదుల స్నేహశ్రీ 590, కోగంటి వైష్ణవి 587, దీపాల బిన్ను హరినాగ తిలక్ 576, కారంపూడి లీలాప్రసాద్ 570, మాగం వేదవాణి 563 మార్కులు సాధిం చారని చెప్పారు. టిప్పర్ల బజారులోని ఓ పాఠశాల విద్యార్థిని కే.హర్షిక లహరి అత్యధికంగా 596 మార్కులు సాధించింది. పెదవడ్లపూడిలోని ఓ పాఠశాల విద్యార్థిని డి.వర్షిత 593, ఎం ధీరజ 591, మార్కులు సాధించారు.

తాడేపల్లిలో 68 శాతం ఉత్తీర్ణత



డోకిపర్తి నవ్యశ్రీ, ఎం అక్షర

తాడేపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బుధవారం ప్రకటించిన 10వ తరగతి ఫలితాల్లో తాడేపల్లి మండలం, పట్టణం కలిపి 68శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. మొత్తం తాడేపల్లి పరిధిలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 513 మంది పరీక్షలకు హాజరు కాగా 347 మంది ఉత్తీర్ణులయ్యారు. కాగా జడ్పీహెచ్‌ఎస్ తాడేపల్లికి చెందిన విద్యార్థిని డోకిపర్తి నవ్యశ్రీ 600లకు గాను 571 మార్కులు, కేసీ వర్క్సుకు చెందిన ఎం అక్షర 571 మార్కులతో మండల టాపర్స్‌గా నిలిచారు. కాగా తాడేపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు 600 మార్కులకు గాను 500లకు పైగా 26 మంది విద్యార్థులు సాధించి పాఠశాలకు అత్యుత్తమ ఫలితాలు అందించారు. చిర్రావూరుకు జడ్పీ హైస్కూలు విద్యార్థులు 84 శాతం ఉత్తీర్ణత సాధించారు.

మండలంలో 92 శాతం ఉత్తీర్ణత



ఎస్ రిషిత ఏ పూజిత

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వట్టిచెరుకూరు జడ్పీ హైస్కూల్ నుంచి నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా కొండమోదీ అఖిల్ 588 మార్కులతో ప్రథమ స్థానం, మునిపల్లి నికిలేంద్ర 572 మార్కులతో ద్వితీయ స్థానం, కఠారి బ్రహ్మతేజ 557 మార్కులతో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే ముట్లూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎస్ రిషిత 588 మార్కులతో ప్రథమ స్థానం, ఏ పూజిత 578 మార్కులు ద్వితీయ స్థానం, షేక్ నాగూర్ బీ 577 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. మండలంలో 92 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎంఈవో సత్యనారాయణమూర్తి, నిర్మల అభినందించారు.



షేక్ నాగూర్ బీ కొండమోదీ అఖిల్



మునిపల్లి నికిలేదంద్ర, కఠారి బ్రహ్మతే

గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తా

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



డోకిపర్రులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న శ్రావణ్ కుమార్

మేడికొండూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ చెప్పారు. మేడికొండూరు మండలంలోని మంగళగిరిపాడు, డోకిపర్రు గ్రామాల్లో బుధవారం సీసీ రోడ్లకు శంకుస్థాపనతో పాటు పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డోకిపర్రు ఎంపీయూపీ పాఠశాలలో ప్రజలు నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలు పరిశీలించిన ఎమ్మెల్యే త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అంగన్వాడీ స్కూల్స్ సందర్శించి పిల్లల హెల్త్ చెకప్‌లు, భోజన సదుపాయాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ సెంటర్లోని పిల్లలతో ఆయన ముచ్చటించారు. శాంతినగర్‌లోని చర్చిని సందర్శించి గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమల్లో కూటమి నాయకులు అధికారులతో కలసి పనిచేయాలని, ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. డోకిపర్రులో ఆయన ముఖ్య నాయకులతో సమావేశ మై గ్రామాల్లోని సమస్యలు, అభివృద్ధి ప్రణాళిక, పార్టీ కార్యక్రమాల కార్యాచరణ తదితర అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు పాములపాటి శివన్నారాయణ, మాజీ ఎం పీపీ మొక్కల సుబ్బారావు, ఫిరంగిపురం మార్కెట్‌యార్డు మాజీచైర్మన్ నార్నె శ్రీనివాసరావు, జిల్లా మైనారిటీ సెల్ నాయకులు షేక్ అబ్దుల్ ఘని, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లిపెద్ది రమేష్, ఉపాధ్యక్షులు కంశెట్టి వెంకటేశ్వరరావు, నియోజక వర్గ జనసేన మీడియా కన్వీనర్ కందుల సైదయ్య, రాచర్ల నాగబాబు, నాయకులు కంశెట్టి శ్రీనివాసరావు, ఖరీదు హరిబ్రహ్మయ్య, షేక్ అహ్మతుల్లా, గ్రామ సర్పంచ్ కొండెపోగు సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

పదిలో మెరిసిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



స్వర్ణ దీక్ష పఠాన్ జ్యోఅఫ్రిన్ కర్లపూడి భావన

ప్రత్తిపాడు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ప్రైవేటు పాఠశాలలకు తామేమి తీసి పోమంటూ నిరూపించారు. మండలంలో ఉన్న 8 జడ్పీ పాఠశాలల్లో 362 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందులో 321 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. యనమదల జడ్పీ ఉన్నత పాఠశాలలో 107 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 101 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 94.39 శాతంతో మండలంలో ప్రథమ స్థానంలో నిలవడంతో పాటు అత్యధిక మార్కులు సాధించిన పాఠశాలగా కూడా నిలిచింది. ఈ పాఠశాలకు చెందిన జీ స్వర్ణ దీక్ష 585 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే వంగిపురం పాఠశాలకు చెందిన కే లిఖిత్ 579, గొట్టిపాడుకు చెందిన టీ శ్రీజ, షజియలు 576, ప్రత్తిపాడు జడ్పీ పాఠశాలకు చెందిన ఎన్ కీర్తి 574, చినకోండ్రుపాడు జడ్పీ పాఠశాలకు చెందిన కే ప్రియనందిని 557, కోయవారిపాలెం జడ్పీ పాఠశాలకు చెందిన పీ రాజేష్ 548 మార్కులు, తిక్కిరెడ్డిపాలెం జడ్పీ పాఠశాలకు చెందిన ఏ సందీప్ కుమార్ 508 మార్కులు సాధించి ఆయా పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచారు.

పెదనందిపాడు మండలంలో 93.2శాతం

పెదనందిపాడు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో పది పరీక్ష ఫలితాల్లో 93.2శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ముద్దన శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని 9 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 184 మంది పరీక్షలు రాయగా 163 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాసరావు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు నిరుత్సాహపడొద్దని సూచించారు. నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. గోగులమూడి జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థిని పఠాన్ జ్యోఅఫ్రిన్ 584 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలవండ పట్ల గ్రామస్థులు, పాఠశాల కమిటీ సభ్యులు, పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

కాకుమాను మండలంలో 93 శాతం

కాకుమాను, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పది పరీక్ష ఫలితాల్లో కాకుమాను మండలం 93.38 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో కేఎఫ్ కెన్నడీ తెలిపారు. మండలంలో 272 మంది పరీక్షలకు హాజరవగా 254 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి కర్లపూడి భావన 578 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఎంఈవో చెప్పారు. కాకుమాను జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి కాండ్రు రత్నరాజుకు 577 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు వివరించారు. కాకుమాను జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు 67 మంది పది పరీక్షలకు హాజరవగా 58 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. చిన్నలింగాయపాలెంలో 38 మంది విద్యార్థులకు గానూ 38 మంది, కొమ్మూరు జడ్పీ పాఠశాల నుంచి 23 మంది విద్యార్థులకు 20 మంది ఉత్తీర్ణత సాధించారు. గరికపాడులో 14 మందికి 14 మంది ఉత్తీర్ణత సాధించారని, రేటూరు జడ్పీ పాఠశాలలో 12 మందికి 10 మంది, బోడిపాలెంలో 12 మందిలో 11 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, అంబేడ్కర్ గురుకుల(బాలికల) పాఠశాల నుంచి 74 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 73 మంది ఉత్తీర్ణత సాధించారు. పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, తహసీల్దార్ వెంకట స్వామి, ఎంపీడీవో యుగకీర్తి, ఎంఈవో -2 విజయ్ భాస్కరరావు, తదితరులు అభినందనలు తెలియజేశారు.

జోసిల్ వితరణతో రూపుదిద్దుకున్న తరగతి గదులు

మేడికొండూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో అతి పెద్ద పరిశ్రమల్లో ఒకటైన జోసిల్ లిమిటెడ్ సంస్థ మండలంలోని డోకిపర్రు గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల అదనపు తరగతి గదులను నిర్మించి తన వితరణ చాటుకుంది. గదులను ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ జోసిల్ ఎండీ జాగర్లమూడి మురళీమోహన్‌తో కలసి బుధవారం ప్రారంభించారు. విద్యాభివృద్ధికి సేవలందించిన జోసిల్ ఎండీ జాగర్లమూడి మురళీమోహన్‌కు శాలువాకప్పి పూలమాల వేసి శ్రావణ్‌కుమార్ సన్మానించారు. చాలీచాలని గదులతో ఇక్కట్లు పడుతున్న విద్యార్థుల దుస్థితిని స్థానిక ప్రజా ప్రతినిధులు కొన్నాళ్ల క్రితం జోసిల్ ఎండీ జాగర్లమూడి మురళీ మోహన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే స్పందించి తరగతి గదులకు రూపకల్పన చేశారు. 29లక్షల వ్యయంతో రెండు విశాలమైన తరగతి గదులను నిర్మించారు. భవిష్యత్‌లో మరికొన్ని అంతస్తులు నిర్మించే విధంగా పునాదులు ఏర్పాటు చేశారు. గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎండీ మురళీమోహన్‌ను సత్కరించి విద్యార్థులకు ఆయన అందించిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో జోసిల్ జీఎం రఘురాం, జడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య, ఎంపీడీవో పాటిబండ్ల పూర్ణశంకరరావు, ఎంఈవో షేక్ అబ్దుల్ అలీమ్, హెచ్ ఎం మాధవి, సర్పంచ్ కొండెపోగు సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామస్థుల విరాళాలతో నిర్మించనున్న తరగతి గదులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

ఎస్‌ఆర్‌ఎంలో ఆకట్టుకున్న ఈసీఈ ఓపెన్ హౌస్



ఓపెన్ హౌస్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ సతీశ్‌కుమార్

మంగళగిరిసిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం వర్సిటీలోని అబ్దుల్ కలాం ఆడిటోరియంలో ఓపెన్ హౌస్ డే నిర్వహించారు. యూనివర్సిటీకి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు, ఫ్యాకల్టీ తమ ప్రాజెక్టులతో హౌస్‌లో పాల్గొన్నారు. విద్యార్థుల నుంచి 150కి పైగా పరిశోధనా ప్రాజెక్టులు, ఫ్యాకల్టీ నుంచి మూడు నూతన అంకుర ప్రాజెక్టులు పోటీ పడ్డాయి. యూనివర్సిటీ ప్రో వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సీహెచ్ సతీశ్‌కుమార్ ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థుల్లో నూతన సృజనలకు ప్రాణం పోయడమే కాకుండా సరికొత్త ఆవిష్కరణలకు ఈ తరహా కార్యక్రమాలు దోహదపడతాయని ప్రొఫెసర్ సతీశ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రొఫెసర్లు ఏర్పాటు చేసిన టెక్నాలజీ ప్రాజెక్టుల దగ్గరకు వెళ్లి వివరాలను తెలుసుకున్నారు. వీఎల్‌ఎస్‌ఐ, ఎంబెడెడ్ సిస్టమ్స్, బయోమెడికల్ సిగ్నల్ ప్రాసెసింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సెక్టార్ల నుంచి విద్యార్థులు నూతన ప్రాజెక్టులు తయారు చేసి వాటి వివరాలను వెల్లడించారు. నూతన ప్రాజెక్టులతో సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టిన విద్యార్థులు పూజారి శ్రీసాయి మణికంఠ, అజిత్‌కుమార్, సేడ్ జాబ్ గెలేజా, జల్లేపల్లి భనేష్‌కుమార్, షేక్ సాయితే జమీన్, పొండల వెంకటరమణమూర్తితో పాటు పలువురు ఎంటెక్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఎం రిజిస్ట్రార్ ప్రేమ్‌కుమార్, డీన్ సీవీ టామీ, ఈసీఈ హెడ్ కేఏ సునీత, డైరెక్టర్ అనూప్ సూర్యవంశీ, ప్రొఫెసర్లు వడ్డి రమేష్, సుజిత్ కల్లూరి, ప్రద్యుత్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో 73 శాతం ఉత్తీర్ణత

● ఏపీఆర్‌ఈఎస్ విద్యార్థికి 592 మార్కులు



పసన్నకుమార్‌రెడ్డి, విజయ్‌నాయక్

తాడికొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పది ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొన్న విద్యార్థులు 73 శాతం ఉత్తీర్ణత సాధించారు. 504 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 373 మంది ఉత్తీర్ణత సాధించారు. తాడికొండ ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన విద్యార్థి పీ మహ్మద్ అబ్దుల్ రెహమాన్ 592 మార్కులతో మండలంలో మొదటి స్థానంలో నిలిచాడు. అదే పాఠశాలకు చెందిన బీ ప్రసన్నకుమార్‌రెడ్డి 587 మార్కులతో ద్వితీయ, ఎం విజయ్‌నాయక్ 582 మార్కులతో తృతీయస్థానంలో నిలిచారు. కంతేరు జడ్పీ పాఠశాలలో 96 శాతం, తాడికొండ జడ్పీ పాఠశాలలో 81.25 శాతం, పొన్నెకల్లు జడ్పీ పాఠశాలలో 55 శాతం, రావెల జడ్పీ పాఠశాలలో 70 శాతం, తాడికొండ ఎస్‌వీపీ హైస్కూల్‌కు 88 శాతం, మోతడక శ్రీరామోన్నత పాఠశాలలకు 63.6శాతం, ఏపీ అంబే ద్కర్ గురుకుల పాఠశాలకు 87 శాతం ఉత్తీర్ణత సాధించారు. లాం జడ్పీ పాఠశాలకు 45.45 శాతం, నిడుముక్కల జడ్పీ పాఠశాలకు 47.82 శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థి అబ్దుల్ రెహమాన్‌ను తోటి విద్యార్థులు, అధ్యాపకులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 68.66 శాతం

తుళ్లూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలో అనంతవరం జడ్పీ ఉన్నత పాఠశాల, ఐనవోలు, మందడం, రాయపూడి, తుళ్లూరు ప్రభుత్వ పాఠశాలలు, పెదపరిమి ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలకు చెందిన 351 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 241 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత 68.66 శాతంగా నమోదైంది.

ఫిరంగిపురం మండలంలో..

ఫిరంగిపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 11 ఉన్నత పాఠశాలల్లో మొత్తం 623 మంది పరీక్షలకు హాజరు కాగా 570 మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈవోలు తెలిపారు. అమీనాబాద్ జడ్పీ హైస్కూల్లో పది మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారని హెచ్‌ఎం సునంద తెలిపారు.

మేడికొండూరు మండలంలో 90 శాతం ఉత్తీర్ణత

మేడికొండూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలో 90 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవో షేక్ అబ్దుల్ అలీమ్ బుధవారం చెప్పారు. పేరేచర్లలోని ఓ పాఠశాల విద్యార్థిని బాల గాయత్రి 589 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించింది. ప్రభుత్వ పాఠశాలల్లో కొర్రపాడు జడ్పీ హైస్కూల్లో అత్యధికంగా 94 శాతం ఉత్తీర్ణత సాధించగా, పేరేచర్ల జడ్పీ హైస్కూల్లో అతి తక్కువగా 64 శాతం ఉత్తీర్ణత సాధించారు. సిరిపురం, పాలడుగు జడ్పీ హైస్కూల్లో 88శాతం, మందపాడు జడ్పీ హైస్కూల్లో 93శాతం, మేడికొండూరు జడ్పీ హైస్కూల్లో 89 శాతం, తురక పాలెం జడ్పీ హైస్కూల్లో 82శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

దుగ్గిరాల మండలంలో ఉత్తీర్ణత 83 శాతం



జీ ఉమామహేశ్వరి, చలవాది ప్రగతి, బీ శ్రీలత

దుగ్గిరాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ పాఠశాలలు 83శాతం ఫలితాలు సాధించగా, పెదపాలెం జడ్పీ హైస్కూల్ 93శాతం ఫలితాలు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. రేవేంద్రపాడు హైస్కూల్ విద్యార్థిని జీ ఉమామహేశ్వరరి 575 మార్కులతో మండలంలో ప్రథమస్థానం, దుగ్గిరాల బాలికల హైస్కూల్ విద్యార్థిని చలవాది ప్రగతి 574 మార్కులతో ద్వితీయస్థానం సాధించింది. కాగా తుమ్మపూడికి చెందిన దివ్యాంగురాలు ఆటోడ్రైవర్ బుస్సా నాగరాజు కుమార్తె శ్రీలత 377 మార్కులు సాధించింది. పెదకొండూరు హైస్కూల్ 91 శాతం, దుగ్గిరాల బాలికల హైస్కూల్, ఈమని హైస్కూల్స్ 88 శాతం ఫలితాలు, రేవేంద్రపాడు హైస్కూల్ 80 శాతం, పెనుమూలి హైస్కూల్ 74శాతం, దుగ్గిరాల బాలుర హైస్కూల్ 72శాతం ఫలితాలు సాధించాయి. ప్రైవేటు పాఠశాలల్లో పి.రోమనసల్మా 591మార్కులు, జీ. షణ్ముఖ శ్రావణి 591 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు మండలం పల్లపాడు గ్రామ పొలాల్లో కోడిపందేలు ఆడుతున్న ప్రదేశంపై బుధవారం పోలీసులు దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 9200 రూపాయల నగదు, రెండు కోళ్లను, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రామానాయక్ తెలిపారు.

ముట్లూరులో వైభవంగా శాంతి కల్యాణోత్సవం



ముట్లూరులో వైభవంగా శాంతి కల్యాణ మహోత్సవం

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ముట్లూరులోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి స్వామి శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన ఏటుకూరు జడ్పీస్కూల్ విద్యార్థులు



విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏటుకూరు జడ్పీ స్కూల్లో విద్యార్థులు పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. పాఠశాలకు చెందిన బుర్రి రూపశ్రీ 585 మార్కులతో ప్రథమ శ్రేణిలో నిలిచింది. తోకా చిచ్చు ప్రియవందన 581, డేగల భవాని 574 మార్కులు సాధించారని హెచ్‌ఎం వై వాణి వెల్లడించారు. అదేవిధంగా 500 పైన 8మంది విద్యార్థులు మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను, స్కూల్ టీచర్స్‌ను ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అభినందించారు. భవిష్యత్తులో ఇంకా బాగా చదివి మంచి పౌరులుగా, సివిల్ సర్వీస్ లాంటి ఉద్యోగాలు రాణించాలని ఎమ్మెల్యే రామాంజనేయులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, కార్పొరేటర్ లక్ష్మీదుర్గ వాసు, జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు మార్కండేయులు కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కె.బసవలింగారావు, వేణుగోపాల్, శ్రీనివాస్, మారుతి, పద్మ, రత్నమాల, హసీన పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే రామాంజనేయులు పంపిణీ చేశారు. స్థానిక విద్యానగర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులు పెద్దసంఖ్యలో హాజరై చెక్కులను స్వీకరించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ నియోజకవర్గపరిధిలో సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా 63మందికి రూ.52,29,226 లక్షలు అందించామని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 202 మంది లబ్ధిదారులకు రూ.2,15,07,475 కోట్లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వందనాదేవి, కల్లూరి శ్రీనివాసరావు, ఇమ్మడి మల్లేశ్వరరావు, ఘంటసాల సోమశేఖర్, మండల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

శివాలయం చైర్మన్‌గా బోగి ప్రమాణ స్వీకారం



బోగి కోటేశ్వరరావును అభినందిస్తున్న కిరణ్‌చంద్, రమేష్ తదితరులు

మంగళగిరి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (శివాలయం) ట్రస్టుబోర్డు చైర్మన్‌గా బోగి కోటేశ్వరరావు బుధవారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతోపాటు ధర్మకర్తలుగా జంజనం వెంకట సుబ్బారావు, సుఖమంచి గిరిబాబు, బాపనపల్లి వాసు, ఆకునూరు కరుణ, ఉడతా లావణ్య, చిలకా బసవమ్మ, ఇసుకపల్లి వెంకట లలిత, తిరుమలశెట్టి మురళీకృష్ణ బాధ్యతలు చేపట్టారు. మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్‌బాబు, టీడీపీ నేత మాదల రమేష్‌బాబు తదితరులు చైర్మన్ కోటేశ్వరరావు, సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ డివిజనల్ ఆఫీసర్ శ్రీనివాసులు, శివాలయం ఈవో నారాయణరావు, ప్రధాన అర్చకుడు తెలిదేవరపల్లి మహేష్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు.

ఉగ్ర దాడికి నిరసనగా జనసేన సంతాప దినాలు



జెండా అవనతం చేసి సంతాపం వ్యక్తం చేస్తున్న జనసేన నేతలు

మంగళగిరి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని బైసారన్ వద్ద పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 28మంది అమాయకులను కాల్చి వేయడాన్ని నిరసిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు సంతాప దినాలను పాటిస్తున్నట్టు నేతలు తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ నేతలతో కలిసి పార్టీ పతాకాన్ని అవనతం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు, నేతలు గంజి చిరంజీవి, అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్, విజయశేఖర్, బడే కోమలి, జే రాజారెడ్డి, తిరుమల శెట్టి కొండలరావు, దాసరి శివనాగేంద్రం, చిట్టెం అవినాష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు నియోజకవర్గంలో సంతాపం

గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గం గుంటూరు నగరపాలకసంస్థ 40వ డివిజన్ పెదపలకలూరు గ్రామంలోని పార్టీ కార్యాలయంలో జనసేన పతాకాన్ని అవతనం చేశారు. ఈ సందర్భంగా ఉగ్ర దాడిలో చనిపోయిన కుటుంబాలకి సంతాపం తెలుపుతూ నల్ల బ్యాడ్జీలు ధరించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఘటన చాలా హృదయ విదారకమైనదన్నారు. ఈ గాయాన్ని జాతి మర్చిపోదని అన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి డేగల లక్ష్మణ్, నియోజకవర్గ నాయకులు నాగిని సునీల్‌కుమార్, వెన్నకోట మల్లికార్జునరావు, అడపాల శివ నాగేశ్వరరావు, అల్లం నాగ వెంకట బ్రహ్మం, కొమిరిశెట్టి శంకర్ తదితరులు పాల్గొన్నారు,

పుస్తకాలు మానవ జీవితంలో మిత్రులుగా మారాలి

● ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు



గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న మోహనరావు తదితరులు

పెదనందిపాడు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు మానవ జీవితంలో మిత్రులుగా, మార్గదర్శకులుగా మారాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గేరా మాట్లాడుతూ పుస్తక పఠనంతో మానసిక ఉల్లాసం, ప్రపంచ జ్ఞానం కలుగుతుందన్నారు. నేటి యువత, విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలు, ఇంటర్నెట్, సోషల్‌మీడియా మోజులో పడి పుస్తక పఠనాన్ని మరిచారన్నారు. సమీప గ్రంథాలయాలను తరచూ సందర్శించాలని, అక్కడ అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచినట్లు వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సుభాషిణి, విశ్రాంత ఉపాధ్యాయులు గారపాటి రమేష్, వెలినేని శివయ్య, సునీల్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

సహకార బ్యాంకుల్లో మెరుగైన సేవలు: డీఎల్ కాంతారావు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు సహకార బ్యాంకులు మెరుగైన సేవలు అందిస్తున్నాయని కాకతీయ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డిఎల్ కాంతారావు చెప్పారు. కొత్తపేటలోని ఏలూరి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు తొలి వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వాణిజ్య బ్యాంకుల కన్నా ప్రైవేట్ బ్యాంకుల్లో డిపాజిట్లపై వడ్డీ ఎక్కువగా అందిస్తున్నామన్నారు. వ్యక్తిగత సేవల విభాగంలో కో-ఆపరేటివ్ సెక్టార్ ముందుండేలా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ శేషుకుమార్, రవిమోహన్, వెంకటప్రసాద్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో ముగిసిన జాతీయ సెమినార్

పెదకాకాని, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో యూజీసీ స్పాన్సర్ రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ అన్ మ్యానెడ్ ఏరియల్ వెహికల్స్, అడ్వాన్సెస్, అప్లికేషన్స్ రెండు రోజుల వర్క్ షాపులో భాగంగా రెండోరోజు కార్యక్రమం డైక్‌మెన్ ఆడిటోరియంలో బుధవారం ముగిసింది. రెండో రోజు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ డ్రోన్స్ టెక్నాలజీపై రైతులకు అవగాహన కలిగించి వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు మరింత పరిశోధనలు జరగాలన్నారు. ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ సైంటిస్ట్ డాక్టర్ అంగిరేకుల సాంబయ్య, మేఘాలయ స్టేట్ జీఐఎస్, యూఏవీ సెంటర్ కన్సల్టెంట్ వై.కిషోర్ కుమార్‌లు పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ఎండి తౌ సిఫ్ అహ్మద్ కో కన్వీనర్ డాక్టర్ సిహెచ్ తిరుమలరావు, ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్దయ్య, అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ బి.చంద్రమౌళి మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ బి.పూర్ణ చంద్రశేఖర్, డాక్టర్ టి.సుశీల, కొండ శ్రీదేవి, పి.నరేంద్రమోహన్, అతిథి అధ్యాపకులు డాక్టర్ బి.విజయ్ కుమార్, వై ప్రణతిరెడ్డి, సాంకేతిక నిపుణులు కేఆర్ఎస్ రామారావు, ఎల్.సాంబశివరావు పాల్గొన్నారు.

పాత కమిటీ కాల పరిమితి ముగిసింది: కమిటీ నూతన అధ్యక్షుడు వెంకట్రావు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ పాత కమిటీ కాల పరిమితి ముగిసిందని, కొత్త కమిటీ ఎన్నిక జరిగిందని, కమిటీ అధ్యక్షులు పెండేల వెంకట్రావు చెప్పారు. ఆలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పాత కమిటీ మళ్లీ సర్వసభ్య సమావేశం అంటూ ముందుకు రావడం సరి కాదన్నారు. నవంబరు 30న కమిటీ కాల పరిమితి ముగిసిందని, ఏప్రిల్ రెండో వారంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారని చెప్పారు. ఆ సమావేశంలో ఎన్నిక సాధ్యపడకపోవడంతో మళ్లీ రెండు రోజుల్లో సమావేశం నిర్వహించి కోరం పూర్తి కాగానే కొత్త కమిటీని ఎన్నుకుని ప్రకటించామని స్పష్టం చేశారు. కమిటీ ఎన్నికను వివాదం చేయకుండా పాతకమిటీ సహకారం అందించాలన్నారు. ఆర్యవైశ్యులకు సేవ చేసే విషయంలో పోటీ పడాలని సూచించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి తాతా శ్రీనివాసరావు,మద్ది మల్లికార్జునరావు, పెండేల సుబ్బారావు, యుగంధర్, పెనుగొండ వెంకటేశ్వరరావు, బచ్చు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు నిర్వహిస్తున్న వేసవి చలివేంద్రంలో చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. బుధవారం అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు మున్నంగి శేషసాయి అంబరీష్, గాయత్రి శ్రావ్యప్రద దంపతుల సహకారంతో పాదచారులకు చల్లని మజ్జిగ, తాగునీరును పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కుర్రా శ్రీనివాసరావు, ప్రతాప్, అబ్దుల్ రజాక్, వాసు, ప్రదీప్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురం వద్ద ఉన్న పోలేరమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. పసుపు, కుంకుమ, కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. గుంటి వెంకట్, వీరయ్య ఆధ్వర్యంలో వార్షికోత్సవం నిర్వహించారు. కౌన్సిలర్ త్రిమూర్తులు, అనిత, పద్మశాలీయ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, గురునాథం, సత్యం పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన కలిగి ఉండాలి

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మలేరియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం అన్నారు. బుధవారం స్థానిక మారీసుపేట ఆర్ఆర్ నగర్‌లోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ వసతిగృహ పాఠశాలలో జిల్లా మలేరియా అధికారి టి.మురళీకృష్ణ సుబ్బరాయణం విద్యార్థులకు ప్రపంచ మలేరియా దినోత్సవంపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన జరగనున్న ప్రపంచ మలేరియా దినోత్సవంపై ఈ పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వసతి గృహ ప్రిన్సిపాల్ బి.విజయకుమార్, ఉపాధ్యాయులు బి.నాగమణి, టీవీఎస్ నాగలక్ష్మి, పట్టణ ఇన్‌చార్జ్ సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి, సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, సూద శివగణేష్, ఆరోగ్య విస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి, మలేరియా సూపర్‌వైజర్లు దీపాల శ్రీనివాసరావు, మల్లేశ్వరావు, శివనాగమల్లేశ్వరావు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పదిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

● ఇద్దరికి 591 మార్కులు ● వెనుకబడిన కఠెవరం, నందివెలుగులో నూరుశాతం ఫలితాలు



పది ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఈవో శ్రీనివాసరెడ్డి

తెనాలి అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షా ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు 591 మార్కులు సాధించారు. ఉత్తీర్ణత శాతంలో కఠెవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుకబడగా, నందివెలుగు హైస్కూల్ నూరుశాతం ఉత్తీర్ణత సాధించింది. రూరల్ మండలంలోని సంగం జాగర్లమూడి హైస్కూల్ విద్యార్థిని వి.మనోజ్ఞ 591 మార్కులు, పట్టణంలోని మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ ఉస్మాజహి 591 మార్కులు సాధించారు. పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉత్తీర్ణత శాతం వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాల 85శాతం, ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్ 73శాతం, గంగానమ్మపేట టీఎస్‌రావు హైస్కూల్, చెంచుపేట కెఎస్ఎం హైస్కూల్ 67శాతం, కొత్తపేట బాలురోన్నత పాఠశాల 62శాతం, మారీసుపేట హైస్కూల్ 61శాతం ఉత్తీర్ణత సాధించాయి. రూరల్ మండలంలో చూస్తే... నందివెలుగు హైస్కూల్ 100శాతం ఉత్తీర్ణత సాధించగా, కాజీపేట హైస్కూల్ 96శాతం, కొలకలూరు హైస్కూల్ 93 శాతం, అంగలకుదురు హైస్కూల్ 92శాతం, బుర్రిపాలెం హైస్కూల్, సంగం జాగర్లమూడి హైస్కూల్స్ 79శాతం, పెదరావూరు హైస్కూల్ 58శాతం, కఠెవరం హైస్కూల్ 49శాతం ఉత్తీర్ణత సాధించాయి. కాజీపేట హైస్కూల్ విద్యార్థిని కె.ఏస్తేరు చిరంజీవమ్మ 583 మార్కులు, ఐతానగర్ ఎన్ఎస్ఎం హైస్కూల్ విద్యార్థులు లక్ష్మీమాధురి, ఫరీద్‌లు 583 మార్కులతో మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచారు.

పొన్నూరులో 83.5శాతం ఉత్తీర్ణత

పొన్నూరు టౌన్, ఏప్రిల్, 23 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షా ఫలితాల్లో పొన్నూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 83.5శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థుల అభినందన కార్యక్రమం బుధవారం ఎంఈవో కార్యాలయంలో జరిగింది. నండూరు జడ్పీహెచ్‌కు చెందిన అక్కి అఖిల 584మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, నేతాజీ నగర్ జడ్పీహెచ్‌కు చెందిన కేతన్‌సాయి 578 మార్కులు, జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌కు చెందిన సుతీక్షణ 578 మార్కులు, బ్రాహ్మణకోడూరు జడ్పీహెచ్‌కు చెందిన ఉప్పల జ్యోతిస్వరూప్ 574 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 638మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 538మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వివరించారు. మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు 83.85శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

చేబ్రోలు మండలంలో

చేబ్రోలు మండలంలో పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 69శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో రాయల సుబ్బారావు తెలిపారు. మండలంలోని ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో 446 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 309మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. నారాకోడూరు జడ్పీహెచ్‌కు చెందిన వై.మౌర్య భూషన్ 585మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఎంఈవో వివరించారు. పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఎంఈవో తదితరులు అభినందించారు.

కొల్లిపర మండలంలో...

కొల్లిపర, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి ఫలితాల్లో 87శాతం ఉత్తీర్ణత అయ్యినట్లు ఎంఈవో సాల్మన్‌రాజ్ తెలిపారు. బుధవారం స్థానిక విద్యాభవనంలో జరిగిన సమావేశంలో అయిన మాట్లాడుతూ 361మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 315మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలియజేశారు. మండల పరిధిలోని వల్లభాపురం హైస్కూల్‌కు చెందిన టి.పూజితారెడ్డి 591మార్కులు, మున్నంగి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన సీహెచ్ జీవన 587 మార్కులు, ఎన్.సుచరిత 583 మార్కులు సాధించి మండలంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

విద్యార్థినికి అభినందనలు

కొల్లిపర, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి ఫలితాల్లో మండల పరిధిలోని వల్లభాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 600 మార్కులు గాను 591 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు తియ్యగూర పూజితారెడ్డిని బుధవారం ఉపాధ్యాయులు అభినందించారు. అభినందించిన వారిలో ఎంఈవోలు సాల్మన్‌రాజు, ఝాన్సీలత, ప్రధానోపాధ్యాయుడు శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.



వల్లభాపురంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రైవేట్ పాఠశాలల్లో...



595 మార్కులు సాధించిన పరమేశ్వరిని అభినందిస్తున్న డైరెక్టర్ సుకుమార్‌బాబు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. బస్ స్టేషన్ వద్ద ఉన్న డాక్టర్ కెఆర్ గౌతమ్ హైస్కూల్ విద్యార్థి జోయల్ త్యాగి 595 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. 590కి పైగా మార్కులు ఇద్దరు సాధించగా, 580కి పైగా 13 మంది, 570కి పైగా 34 మంది, 560కి పైగా 58 మంది విద్యార్థులకు 500లకు పైగా మార్కులను 132 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

వివేకా విద్యాసంస్థల్లో...

వివేకా విద్యా సంస్థల్లో సిహెచ్ పరమేశ్వరి 595, జోషిత 590, ఆశ్విత, నిస్సి 589, మంజుశ్రీ 588, మహాలక్ష్మి, గీతిక, చకిత్, షయాన్ 587 మార్కులు సాధించారని డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ తెలిపారు. 580కి పైగా మార్కులను 21 మంది విద్యార్థులు సాధించారని, 550కిపైగా మార్కులు 98మంది పొందారని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపల్ షహనాజ్ బేగం, శ్రీనివాసరావు, రత్నకుమారి, రమేష్, వెంకటరత్నం అభినందించారు.

పొన్నూరు వివేకాలో...

పొన్నూరు టౌన్, ఏప్రిల్, 23 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో పొన్నూరు వివేకా విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించినట్లు పాఠశాల డైరెక్టర్ ఉప్పల సుకుమార్‌బాబు తెలిపారు. బుధవారం విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. పట్టణానికి చెందిన నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన పరమేశ్వరి అనే విద్యార్థిని పది ఫలితాల్లో 595మార్కులతో రాష్ట్రస్థాయిలో ముందంజలో ఉన్నట్లు తెలిపారు. 12మంది విద్యార్థులు 58ఏ మార్కులకు పైగా సాధించినట్లు చెప్పారు. 98మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించి గ్రామీణ స్థాయిలో అసాధారణ ప్రతిభ చూపినట్లు సుకుమార్‌బాబు తెలిపారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో 467మార్కులతో తమ కళాశాల విద్యార్థిని కృష్ణసాయి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఇన్‌చార్జ్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ అజమతుల్లా తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

మాంటిస్సోరీలో...

మాంటిస్సోరీ హైస్కూల్ నూరుశాతం ఫలితాలు సాధించామని ప్రిన్సిపల్ జేమ్స్ మోర్లే తెలిపారు. షేక్ సుహానా 589, ఎం.పూర్ణచంద్రిక 584, నేహ, కేసర్లు 571 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాలలో బుధవారం జరిగిన సమావేశంలో అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న వివేకా డైరెక్టర్ వీరనారాయణ

ఆదర్ష్ విద్యా సంస్థల్లో....

ఆదర్ష్ విద్యా సంస్థల్లో పదో తరగతిలో 86 మంది విద్యార్థులకు 550కి పైగా మార్కులు లభించాయని డైరెక్టర్ వరుణ్ తెలిపారు. తమ విద్యా సంస్థల్లో లక్ష్మీనాగసాయి ప్రసన్న 583మార్కులు సాధించి విద్యా సంస్థల్లో ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను చైర్మన్ నియతి, ప్రిన్సిపల్ బ్రహ్మానందం, ఉపాధ్యాయులు అభినందించారు.



జోయల్ త్యాగి (595)

షారోన్ హైస్కూల్‌లో....

బోసురోడ్డులోని షారోన్ హైస్కూల్‌లో ప్రణీత 575, సాక్షి 564, నాగ ప్రసిద 544, మేర్సి 538, నవ్యసాయి 537, సాధన 526, నాగ ప్రసూన 521, పవిత్ర 520, ఓంకార్ 514, సంజన 503, షాలేంరాజు 501 మార్కులు సాధించారని ప్రిన్సిపల్ మేరి బెనర్జీ తెలిపారు.

నవోదయ హైస్కూల్‌లో...

గంగానమ్మపేట నవోదయ విద్యానికేతన్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డైరెక్టర్ చదలవాడ బుచ్చయ్య చౌదరి తెలిపారు. విద్యార్థులు చర్విత 578, శాన్వితశ్రీలీల 562, ప్రవీణ్ 551, జశ్వంత్ 505 మార్కులు సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

అంగలకుదురు విశ్వవేదలో...

మండలంలోని అంగలకుదురు విశ్వవేద హైస్కూల్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించామని ప్రిన్సిపాల్ కాట్రగడ్డ శ్రీనివాస్ తెలిపారు. రాంచరణ్ 544 మార్కులు, సంధ్య 538, నందకిషోర్ 535, చందు 519, వెంకటేశ్వరరావు, 514 మార్కులు సాధించారని విద్యార్థులను అభినందించారు.

నెహ్రూనికేతన్‌లో...

బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్‌లో 55మంది విద్యార్థులకు 500లకు పైగా మార్కులు లభించాయని ఎండీ మురళీకాంత్ తెలిపారు. పరీక్షలలో జునేరా ఫాతిమా 586, వేదజ, సాయి శృతి 585, ప్రవల్లిక 583, దేదీప్య 582, దానిష్ 580 మార్కులు సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

చేబ్రోలు ప్రెసిడెన్సీ స్కూల్‌లో...

చేబ్రోలులోని ప్రెసిడెన్సీ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ చూపారని డైరెక్టర్ వాసిరెడ్డి బన్‌బాబు, ప్రిన్సిపాల్ ఆశాలత తెలిపారు. మీనిగ దేవి 584మార్కులు, బాలసాయిసూర్యనారాయణ 580, అజిత్ 576 మార్కులు సాధించారని విద్యార్థులను అభినందించారు.

ఉగ్రదాడిపై నిరసనల వెల్లువ

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి హేయమైన చర్యని జనసేన జిల్లా కార్యదర్శి దేశంశక్తి సూర్య అన్నారు. బుధవారం జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఉగ్రదాడి మృతులకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ కశ్మీర్‌లో 29మందిని దారుణంగా హత్య చేసిన ముష్కరులను కఠినంగా శిక్షించాలన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శింగంశెట్టి శంకర్, మిరియాల చంద్రకాంత్, గడ్డలూరి చందు, అన్నదాసు చిన్న, నరేష్, ఆదాల ప్రశాంత్, వి.సుబ్బారావు, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి మారీసుపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి స్వయం పర్యవేక్షణలో కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడుల్లో మరిణించిన వారి ఆత్మశాంతికై శాంతి దీపయజ్ఞాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ పహల్గామ్‌లో ఉగ్రదాడి 28మంది మృతిచెందడం బాధాకరం అన్నారు. దేశంలో తమ పరిస్థితిపై ఇప్పటికైనా హిందువులు మేలుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. జమ్ముకాశ్మీర్‌లోని బైసరన్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేసి పలువురిని హతమార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తూ హిందూ చైతన్య వేదిక తెనాలి శాఖ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీని నిర్వహించారు. బుధవారం స్థానిక గాంధీచౌక్‌లో హిందూ చైతన్య వేదిక అధ్వర్యంలో కాశ్మీర్‌లో జరిగిన ఇస్లామిక్ ఉగ్రవాద చర్యలను ఖండించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక సభ్యుడు అంబటి మారుతిరావు, బీజేపీ పటణ, మండలాధ్యక్షులు అడపా సంపత్ రాయుడు, నందకిషోర్, శ్రీనివాస్, పొట్టి మూర్తి శ్రీనివాస్, నరేంద్ర స్వామి, ఎం గురుమూర్తి, యర్రం రాజు, సందీప్, పాదర్తి కిషోర్, పర్చూరి రమేష్, కొల్లూరు సంతోష్, అమరా రమణ తదితరులు పాల్గొన్నారు.



శాంతి దీప యజ్ఞంను నిర్వహిస్తున్న పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి, భక్తులు తదితరులు



తెనాలిలో కొవ్వొత్తుల ప్రదర్శనలో జనసేన పార్టీ నాయకులు

జనసేన సంతాపదినాలు

తెనాలిరూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడులను ఖండిస్తూ జనసేన పార్టీ మూడు రోజుల పాటు సంతాపదినాలను ప్రకటించింది. అందులో భాగంగా బుధవారం పార్టీ కార్యాలయాల్లో జనసేన జెండాను అవనతం చేశారు. పట్టణంలోని పలు ప్రధానకూడళ్లలో జనసేన పార్టీ శ్రేణులు కొవ్వొత్తులతో మృతులకు శాంతిచేకూరాలని కోరారు.

జనసేన నాయకులు నిరసన

కొల్లిపర, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీరు పహల్గామ్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేసి 28 మందిని హతమార్చడాన్ని ఖండిస్తూ జనసేన పార్టీ పీఏసీ చైర్మన్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు మండలంలోని దావులూరు అడ్డరోడ్డు వద్ద బుధవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. వారిలో జనసేన మండల అధ్యక్షుడు యర్రు వెంకయ్యనాయుడు, జనసేన నాయకులు అడపా నారాయణరెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, కె.కిశోర్‌రెడ్డి, కె.శ్రీను, ఏ వేణుగోపాల్, వై.అనిల్, పి.వాసు, టి.శివయ్య, డి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స

● డాక్టర్ హిమబిందు

తెనాలి రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధులను సైతం సంప్రదాయ వైద్యమైన ఆయుర్వేదం నయం చేయగలదని వైద్యురాలు డాక్టర్ హిమబిందు చెప్పారు. బుధవారం సంగంజాగర్లమూడి వైద్యశాలలో ఆమె ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడుతూ పూర్వీకులు అనారోగ్య సమస్యలు వస్తే ప్రకృతి నుంచి వచ్చిన ఔషధగుణాలు కలిగిన మొక్కలను ఎంచుకుని వాటిద్వారా వైద్యం అందించేవారన్నారు. అప్పటి వారు దాదాపుగా 80 నుంచి 100 ఏళ్ల బతికేవారన్నారు. అంతటి గొప్ప ఆయుర్వేదాన్ని భావితరాల వారికి అందించాలన్న ఉద్దేశంతో ఆయుర్వేద వైద్యశాలలు సేవలందిస్తున్నాయన్నారు. సంగంజాగర్లమూడి పీహెచ్‌సీలో ఆయుర్వేద విభాగం ప్రత్యేకంగా ఉందన్నారు. దీని ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను నయంచేసేలా వైద్యశాల సేవలందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆయుర్వేద వైద్యశాలను సద్వినియోగం చేసుకోవలని కోరారు. పలువురు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణలో ద్వితీయ ర్యాంకర్‌కు అభినందనలు



విద్యార్థినికి అభినందనలు తెలుపుతున్న తహసీల్దార్, ఎంఈవో తదితరులు

తెనాలి రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో టాపర్‌గా 987 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్ సాధించిన తెనాలికి చెందిన యండ్రపాటి గ్రేసీ మాణిక్యచోజన్‌ను తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణలు అభినందించారు. విద్యార్థిని తండ్రి యండ్రపాటి రాజేష్ డీఆర్‌డీఏలో పనిచేస్తూ కొవిడ్ సమయంలో మృతిచెందారు. తల్లి పుష్పలత సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా గుంటూరులో పనిచేస్తున్నారు. విద్యార్థిని హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కళాశాలలో విద్యనభ్యసిస్తూ స్టేట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించడంతో తహసీల్దార్, ఎంఈవోలు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. శ్యామ్‌యండ్రపాటి అశోక్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళప్రభాకర్, న్యాయవాది విద్యాసాగర్, హైకోర్టు న్యాయవాది పెరికల డానియల్, ప్రేమ్‌రాజ్, శేషు, వెంకటేశ్వరరావు, సుందర్, సునీల్, శ్యామ్‌సాగర్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) ఏప్రిల్, 23 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలంలో పలువురు లబ్ధిదారులకు బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను కూటమి పార్టీల నాయకులు పంపిణీ చేశారు. స్థానిక నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కొత్తరెడ్డిపాలెంకు చెందిన తోట సాంబయ్యకు రూ.40,000, శలపాడు గ్రామానికి చెందిన తాళ్లూరి రమాదేవికి రూ.1.19లక్షలు, గుండవరం గ్రామానికి చెందిన గుంటూరు రజినికి రు.93,618, శేకూరుకు చెందిన దైరుబోయిన రమాదేవికి రూ.44,406, వేజెండ్లకు చెందిన గుమ్మా శివయ్యకు రూ.1.10లక్షలు, వేజెండ్లకు చెందిన షేక్ ముత్లబ్ కుటుంబానికి రూ.86,384, తోట్లపాలెంకు చెందిన కట్టివరకు లలితకుమారికి రూ.25,541ల నగదు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు షైలా వెంకటరామరాజు, అనంత లక్ష్మీనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు చందు శ్రీరాములు, వీరంకి రంగారావు, మాజీ ఎంపీపీ ఖాదర్‌బాషా, బండ్లమూడి జ్యోతిబాబు, గవిని రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం



మూల్పూరు చినజక్రయ్య (కంపౌండర్)

అమృతలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మూల్పూరు గ్రామానికి చెందిన మూల్పూరు చినజక్రయ్య (కంపౌండర్) కనబడటం లేదని కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఇతని వయస్సు 70 సంవత్సరాలు ఉంటుందన్నారు. ఇతని బంధువుల దినకర్మల నిమిత్తం ఈ నెల 18వ తేదీన మూల్పూరు నుంచి కొండవీడు గ్రామానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గుంటూరు వరకు వచ్చాడని అక్కడ నుంచి కనబడటం లేదని కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 8019972823, 9110764963 అను ఫోన్ నెంబరులో గాని సమీపంలోని పోలీసు స్టేషన్‌లో సమాచారం తెలపాలని పోలీసులు తెలిపారు.

వేసవి తీవ్రతపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

● మండల వైద్యాధికారి సుమంత్

కొల్లిపర, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రతపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మండల వైద్యాధికారి సుమంత్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని దావులూరులో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ప్రతి ఒక్కరూ నీటిని అధికంగా తీసుకోవడం మంచిదన్నారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోకూడదన్నారు. వాంతులు, తలతిరగటం వంటి సమస్యలు వస్తే వెంటనే వైద్యాధికారులను సంప్రదించి తగిన చికిత్స పొందాలన్నారు. గర్భిణులు ప్రతినెల వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ కుమారి, ఏఎన్ఎమ్ వసుమతి, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

● జిల్లా గ్రంథాలయ సంస్థకార్యదర్శి సుబ్బరత్నమ్మ

తెనాలి రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో అనేక విషయాలను తెలుసుకోవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థకార్యదర్శి సుబ్బరత్నమ్మ చెప్పారు. మండలంలోని కొలకలూరు శాఖ గ్రంథాలయంలో బుధవారం ప్రపంచపుస్తక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారిని కడియాల సుజాత వివిధ రకాల పుస్తకాలను ప్రదర్శనగా ఉంచారు. వివిధ స్కూల్స్ విద్యార్థులు పాల్గొని పుస్తకాలను తిలకించి పఠనం చేశారు. గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి సుబ్బరత్నమ్మ గ్రంథాయాన్ని తనిఖీచేశారు.

● తెనాలి అర్బన్: ఈ నెల 27న విజయవాడలో జరిగే గ్రంథాలయ పునర్వికాస ఉద్యమసదస్సును జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞానకేంద్రంలో సదస్సు జరుగుతుందన్నారు. విద్యాసంస్థలు-గ్రంథాలయాలు, సాంకేతికయుగం-పుస్తకపఠన ఆవశ్యకత-పౌర గ్రంథాలయాలు-సమస్యలు-పునఃనిర్మాణం-సాహిత్యం అనే అంశాలపై సదస్సులు జరుగుతాయని సీపీఎం నాయకులు కనపర్తి బెన్‌హర్ తెలిపారు.

28నుంచి గ్రంథాలయాల్లో వేసవి శిక్షణా శిబిరాలు

తెనాలి రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28 నుంచి జూన్6 వరకూ శాఖ గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని కొలకలూరు శాఖ గ్రంథాలయాధికారి కడియాల సుజాత తెలిపారు. ఈ శిబిరం ద్వారా విద్యార్థులకు కథలు చదివించడం, అందులో నీతిని భోదించడం, వివిధ రకాల బొమ్మలు గీయించడం, పెయింటింగ్ వేయించడం, పలు రకాల ఆటలు ఆడించడం వంటివి నిర్వహించడం జరుగుతుందన్నారు.